1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ

ఆదివారం | జులై 28, 2024 | www.navatelangana.com

ఆకతాయిలపై కేసులు

నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

రాత్రి వేళల్లో తాగి బైక్ లపై తిరుగుతూ, గుంపులుగా కూర్చొని కాలనీలో న్యూసెన్స్ చేసే వారిపై 11 కేసులు నమోదుచేసినట్లు వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కొందరు ఆకతాయిలు రాత్రి వేళల్లో తాగి బైక్ లపై తిరుగుతూ న్యూసెన్స్ చేస్తూ ఇబ్బందుల గురి చేస్తున్నారని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మొత్తం 20 మందిని పట్టుకొని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శనివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ తిరిగి ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే జైల్ శిక్ష తప్పదని హెచ్చరించారు.

రూ.10వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ -చిట్యాల టౌన్

మండల పరిధిలోని వెలిమినెడ్ సెక్టార్ పరిధిలో గల పిట్టంపల్లి మొదటి అంగన్వాడీ సెంటర్ ఆయా మేడి కృష్ణమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఐసీడీఎస్ ఆఫీసు నుండి పదివేల రూపాయల ఆర్థిక సహాయం సెక్టార్ సూపర్‌వైజర్ పారిజాత అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండలం లోని టీచర్స్ ఆయాలు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ వీరశేఖర్

నవతెలంగాణ -త్రిపురారం



యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా , సైబర్ నేరాల పట్లఅప్రమత్తంగా ఉండాలి ఎస్సై వీర శేఖర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు పోలీస్ కళాబృందంచే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాల్లో యువత చిక్కుకుని ఆర్థికంగా నష్టపోకుండా తెలియని ఆన్లైన్ గేమ్ ఆడటం వల్ల ఆర్థికంగా నష్టపోతారన్నారు. అదేవిధంగా మాదకద్రవ్యాలకు ,మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా చదువుకున్న విద్యార్థులు కుటుంబ సభ్యులకు కూడా అర్థమయ్యే విధంగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా... డిస్ట్రిబ్యూటరీ కాలువలు



తుంగతుర్తి సమీపంలో మెయిన్ వరద కాలువలో పెరిగిన కంపచెట్లు

సాగర్ నీటిని పొలాల చెంతకు చేర్చే డిస్ట్రిబ్యూటింగ్ కాలువలు అస్తవ్యస్త మారాయి. కాలువలు బండరాళ్లు, కంపచెట్లతో నిండిపోయి కనిపిస్తున్నాయి. సాగర్ ప్రాజక్టుకు నీళ్లు వస్తే డిస్ట్రిబ్యూటరీ కాలువలకు నీటిని వదిలే అవకాశముంది. నీళ్లు వదులుతారనే ఆశతో ఇప్పటికే రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. కాలువల్లో కంపచెట్లు, బండరాళ్లు ఉండడంతో నీళ్లు పారే పరిస్థితి కన్పించడంలేదు. దీంతో ఆందోళనల చెందుతున్నారు.

- కంప చెట్లు బండ రాళ్లతో నిండిన ఏఎంఆర్పీ 8,9 డిస్ట్రిబ్యూటరీ కాలువలు
- మెయిన్ వరద కాలువలో ఎక్కడ చుసినా కంప చెట్లే..

నవతెలంగాణ -పెద్దవూర

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి బిరబిరా పరుగులిడుతున్న కృష్ణమ్మ ఒక్కో ప్రాజెక్టును నింపుకుంటూ వస్తోంది. ఈ నెలాఖరు నాటికి నాగార్జునసాగర్ ప్రాజెక్టును కూడా చేరే సూచనలు కనిపిస్తున్నాయి. ఆగస్టు చివరి వరకు సాగర్ జలాశయం నిండే అవకాశం ఉంది. దీంతో ఆయకట్టు రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తున్నారు. సాగర్ నీటిని పొలాల చెంతకు చేర్చే డిస్ట్రిబ్యూటింగ్ కాలువలు మాత్రం అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గం, పెద్దవూర పీఏ పల్లి మండలం పెద్దవూర ప్రధాన సాగునీటి వనరైన ఏఎంఆర్పీ, వరద కాలువకు వున్న డిస్ట్రిబ్యూటరీ కాలువలు కంప చెట్ల, బండ రాళ్లతో మూసుకొని పోయాయి.నాగార్జున సాగర్ లోకి అనుకున్నంత గా వరద చేరితే డిస్ట్రిబ్యూటరీ కాలువలకు నీళ్ల విడుదల చేస్తారు. సాగర్ వరద మెయిన్ కాలువ లో కూడా కంప చెట్లు పెరిగాయి. ఒక వేల నీళ్ల విడుదల చేస్తే చివరికి నీళ్లు అందని పరిస్థితి వుంది. మరి పొలాల్లోకి నీరందించే డిస్ట్రిబ్యూటింగ్ కాలువల పరిస్థితి గందరగోళంగా ఉంది. సంబంధిత కాలువలకు పలు చోట్ల చివరి పొలాలకు సాగు నీరందని దుస్థితి నెలకొంది. ఈ పంట కాలువలకు అరకొరగా చేసిన లైనింగ్ శిథిలమైనా ఏండ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఎంఆర్పీ డిస్ట్రి బ్యూటరీ 08, 09 కాలువలు పెద్దవూర మండలం లో 16,000,పీఏ పల్లి మండలం 25 వేల ఎకరాలు మొత్తం 41,000 ఎకరాలకు సాగు నీళ్ల అందుతున్నాయి.కానీ వాటి డిస్ట్రిబ్యూటరీల పరిస్థితి చుస్తే కన్నీరొస్తుంది.

మెయిన్ వరద కాలువలో కంప చెట్లు..

ఏఎంఆర్పీ వరద మెయిన్ కాలువ ఎక్కడికక్కడ కంపచెట్లు పెరిగి రైతుల పంట పొలాలకు నీరందని పరిస్థితి నెలకొంది. కంప చెట్లు, బండ రాళ్లు తొలగించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వరద కాలువ 85 కిలోమీటర్లు, 36 డిస్ట్రిబ్యూటరీ కాలువలు వున్నాయి. వీటి పరిధిలో 80 వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా, 200 చెరువులను నింపడం, 250 గ్రామాలకు తాగు నీళ్లు అందుతున్నాయి. ఇంత ప్రాముఖ్యత వున్న ఈ మెయిన్ వరద కాలువల, డిస్ట్రిబ్యూటరీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. వేసవిలో కాలువల స్థితిగతులను పరిశీలించి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు ఈసారి అటువైపు చూసిన పాపాన కూడా పోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు చేపడతాం
ఏఎంఆర్పీ ఏఈ రవిరాజు

ఏఎంఆర్పీ, 8,9, డిస్ట్రిబ్యూటరీలు 34 కిలోమీటర్లు, అందులో 24 కిలోమీటర్ నుంచి 34 కిలోమీటర్ వరకు 10 కిలోమీటర్లకు డబ్బులు శాంక్షన్ అయ్యాయి. త్వరలో పనులు ప్రారంబిస్తాము. అలాగే 1-23కిలోమీటర్ వరకు గత రెండున్నర ఏళ్ల కింద కంప చెట్లు తొలగించాము. మళ్ళీ కంప చెట్ల తో నిండిపోయింది. త్వరలో ఉన్నాతాధి కారులకు ప్రతిపాదనలు పంపుతాం. విడుదల కాగానే పనులు చేపడతాం.

కంప చెట్లు తొలగిస్తాం
ఏఎంఆర్పీ ఈఈఖదీర్

మెయిన్ వరద కాలువను పరిశీలించి ఎక్కడెక్కడ చెట్లు పెరిగాయి, బండ రాళ్లు ఎక్కడెక్కడ వున్నాయి కాలువ పరిధిలో పరిశీలించి చెట్లు, బండ రాళ్లు ఉన్నట్లయితే పనులు వర్కు ఇన్‌స్పెక్టర్లకు అప్పగించి తొలగిస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కాలువలో వున్న చెట్లు, బండ రాళ్లు తొలగిస్తాం.

డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో కంప చెట్లు తొలగించాలి
రైతు కోట సత్యనారాయణ రెడ్డి, కొత్త గూడెం

రెండేళ్లగా సాగర్ జలాశయం నిండక వరద కాలువలకు నీళ్ల విడుదల చేయలేదు. ఈసారి సాగర్ జలాశయం నిండే అవకాశాలు మెరుగ్గా వున్నాయి. అందువల్ల డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో, కంప చెట్ల, బండరాళ్ల వున్నాయి. వాటిని తొలగిస్తే నీటి విడుదల సమయంలో చివరిరైతులకు నీళ్ళు అందుతాయి. అధికారులు ఆదిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

రెండేండ్లుగా కరువుతో అల్లాడి పోయాం
రైతు ఇరుమాది శ్రీనివాస్ రెడ్డి, తుంగతుర్తి

రెండేండ్లుగావర్షాలు పడక చెరువులు, కుంటలు, బోర్లు ఎండిపోయి కరువు కోరల్లో అల్లాడి పోయాం. ఈసారి ఎగువ ప్రాజెక్టులు ఒక్క టొక్కటిగా నిండుతున్నాయి. సాగర్ ప్రాజెక్టు కూడా నిండుతుందని అశగా ఎదురు సూస్తున్నాం.నీళ్ల విడుదల లోపే అధికారులు ఏఎంఆర్పీ 8,9 డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో, మెయిన్ వరద కాలువల్లో కంప చెట్లు తొలగిస్తే అరుతడి పంటలకు నీళ్ల అందుతాయి.

డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి సాగునీరు అందించాలి

- సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికివినతి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించాలని, ఎస్ఎల్‌బిసి సొరంగం పూర్తికి, మూసీ ఆధునీకరణకు తగిన నిధులు కేటాయించాలని, సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్ వీరయ్య జి. నాగయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ప్రతినిధి బందం ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగంగా డిండి, ఎత్తిపోతల పథకం నిర్మాణం చేసి క్షామ ఫ్లోరిన్ పీడిత ప్రాంతాలైన మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని సుమారు 3.61 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు జి.వో. 107 ను గత 2015న విడుదల చేశారని గుర్తు చేశారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల పరిధిలోని సుమారు 3.41 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారని, దానికింద కొన్ని నిధులు మంజూరు చేసి సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టిరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతున్నాయని, కానీ గత ప్రభుత్వం డిపిఆర్‌ను ఆమోదించలేదని తెలిపారు. పర్యావరణ అనుమతుల కోసం లేఖ రాయలేదని, దీంతో ఈప్రాజెక్టు విషయమై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉన్నదని తెలిపారు. తమ ప్రభుత్వమైనా వెంటనే పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన ఎదుళ్ల రిజర్వాయర్ నుండి రోజుకు 0.5 టీఎంసీ ల చొప్పున 60 రోజుల పాటు 30 టీఎంసీలు నీటిని తీసుకునే విధంగా డీపీఆర్‌ను అమోదించాలని, పర్యావరణ అనుమతుల గురించి ప్రభుత్వం వెంటనే లేఖ రాసి త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు.

లిఫ్టుల నిర్వహణ ప్రభుత్వానిదే...

నాగార్జునసాగర్ ఎడమ కాలువపై ఉన్న 43 లిఫ్టుల పైపులు దెబ్బతినడం, మోటర్లు మరమ్మతులకు రావడం వల్ల ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఉన్నదని, ఆపరేటర్ల జీతభత్యాలను రైతులు భరించలేక పోతున్నారని, లిఫ్టుల మరమ్మతులు, ఆపరేటర్ల జీతభత్యాలతో పాటు లిఫ్టుల పూర్తి నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే చేపట్టాలని అన్నారు.నల్లగొండ జిల్లాలో సుమారు 3.20 వేల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు సాగునీరు ఇచ్చే శ్రీశైలం సొరంగం పనులు 19 సంవత్సరాల క్రితం 1925 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన పనులు నేటికి 4658 కోట్ల అంచనా వ్యయానికి చేరిందని అన్నారు. 9.5 కి.మీ. సొరంగం తవ్వాల్సి ఉన్నదని బడ్జెట్‌లో కేటాయించిన రూ.800 కోట్లు సరిపోవని, ఎక్కువ నిధులు ఇచ్చి పూర్తికి కాలపరిమితి నిర్ణయించి, పర్యవేక్షణ కమిటీని వేయాలని కోరారు. 2.20 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన పెండ్లిపాకల ప్రాజెక్టు పనులు కూడా పూర్తిగా నిలిచిపోయాయని, దీని కింద 950 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని తెలిపారు. పెండ్లిపాకల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు.

మూసీ ప్రాజెక్టులు తగ్గుతున్న నీటి సామర్థ్యం

1963లో 4.6 టీఎంసీల నీటి సామర్థ్యంతో మూసీ ప్రాజెక్టును నల్లగొండలో నిర్మించారని, కానీ దాంట్లో ఇసుక చేరడంతో క్రమంగా నీటి సామర్థ్యం తగ్గుతుందని చెప్పారు. మూసీ ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువలు శిథిలమయ్యాయని, షట్టర్లు లేకపోవడంతో లైనింగ్ చేయకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు చేరటం లేదని చెప్పారు. మూసీ కాలుష్యం చేరడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. మూసీని ఆధునీకరించి సుందరీకరణ చేసి పర్యాటక కేంద్రంగా అభివద్ధి పరిచి నిధులు కేటాయించాలని కోరారు.

సాయి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్

నవతెలంగాణ-చింతపల్లి



మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో కలెక్టర్ చింతకుంట నారాయణరెడ్డి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ట్రస్టు సభ్యులు కలెక్టర్ కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, తాసిల్దార్ విజయకుమార్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, ట్రస్ట్ చైర్మెన్ మంచిగంటి ధనంజయ, తదితరులు పాల్గొన్నారు..

ఆర్ఎస్ కిడ్స్ స్కూల్లో ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-మిర్యాలగూడ



తెలంగాణ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల పండుగను పట్టణంలోని అశోక్ నగర్ లో గల ఆర్.ఎస్ ద స్కూల్ పాఠశాలలో కరస్పాండెంట్ సంటి సురేందర్ రెడ్డి,ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పండుగల్లో బోనాల పండుగ ఒకటని వారు అన్నారు. విద్యార్థులు బోనాలు చేసుకొని వివిధ విషాదరణ లో బోనాల పండుగ వాతావరణాన్ని కల్పించే విధంగా పాఠశాలలో విద్యార్థులు బోనాల డాన్సులు, ఆట పాటలతో ఘనంగా నిర్వహించారన్నారు. పాఠశాలలో ఉన్నత విద్యతోపాటు విద్యార్థులకు కల్చరల్ యాక్టివిటీస్ తో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను మా పాఠశాల అందిస్తుందని అన్నారు.విద్యార్థుల తల్లి,దండ్రులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సరిత,దేవి, రోజా,అనిత,నాగేశ్వరి, శకుంతల,ఫర్వీన,సమీనా,అను పల్లవి,అవినాష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టల్

- కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి పాలడుగు నాగార్జున



కట్టంగూరు

నవతెలంగాణ -కట్టంగూరు

మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్ సమస్యల వలయంలో చిక్కుకుందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ను కెవిపిఎస్ అధ్యయన యాత్ర లో భాగంగా పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిరాయి భవనం వల్ల సరైన సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు, స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల పైగా అవుతున్న విద్యార్థులకు ఇప్పటివరకు నోటు పుస్తకాలు ఇవ్వలేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. విద్యార్థులకు సరిపడా దుస్తులు,బెడ్ షీట్లు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇకనైనా హాస్టల్ సమస్యపై దృష్టి సారించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధ్యయన యాత్రలో జిల్లా ఉపాధ్యక్షుడు ఒంటెపాక కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు రవీంద్ర కుమార్, మండల కార్యదర్శి చిలుముల రామస్వామి, నార్కట్‌పల్లి మండల కార్యదర్శి దండు రవి, సైదులు ఉన్నారు.



చండూరు

చండూరు : సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి అని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ బొట్టు శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘంనియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర హాస్టల్లో సందర్శించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో బాత్రూంలు సరిగా లేవన్నారు. భవనంలో లైట్లు, ఫ్యాన్లు, కిటికీలు సరిగా లేవన్నారు. ఈ కార్యక్రమంలో కెఈపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఖమ్మం రాములు, చారి, దుబ్బాక యాదయ్య, నరసింహ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : నియోజకవర్గంలో హాస్టల్ల కు సొంత భవనాలు, సరైన సౌకర్యాలు లేక చదువుకునే పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారనికేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రేమడాల పరశురాములు ఆవేదన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ అధ్యయన యాత్రలో భాగంగా శనివారం పట్టణంలోని పలు హాస్టళ్లను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో విశాలంగా ప్రభుత్వ భూములు ఉన్న ఎస్సీ ఎస్టీలకు హాస్టళ్ల నిర్మించడంలో ప్రభుత్వాలు



మిర్యాలగూడ

విఫలమయ్యాయని ఆరోపించారు. అద్దె భవనాలకు కిటికీలు లేక, బాత్రుములు సరిపోక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆడపిల్లలకు సరైన సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు .రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోడి రెక్క మల్లయ్య విద్యార్థులు సావిత్రి, రూపశ్రీ పాల్గొన్నారు.

పెద్దవూర : ప్రతి వసతి గృహంలో విద్యార్థులకు జనరేటర్ ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు దొంతాల నాగార్జున అన్నారు. శనివారం పెద్దవూర మండలం పులిచెర్ల గ్రామంలో ఉన్న ఎస్టీ హాస్టల్‌లో ఉన్న సమస్యలను విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డెన్లు స్థానికంగా ఉండక విద్యార్థులు తమకు ఇష్టం వచ్చినట్లు హాస్టల్లో ఉంటున్నారని వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా తయారైందని ఆవేదన వ్యకం చేశారు. రాత్రిపూట కరెంటు పోతే విద్యార్థులు చీకట్లోనే ఉంటున్నారని, తక్షణమే హాస్టల్లో జనరటర్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బ కృష్ణ, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రయ్య మృతి చాలా బాధాకరం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు



గుంటోజు చంద్రయ్య మృతి చాలాబాధాకరమని సీపీఐ'ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు.శనివారం గట్టుపల గ్రామానికి చెందిన చంద్రయ్య మృతదేహానికి పూలమాలలు వేసిఆయన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆనాటి రజాకార్లకు, దొరలకు వ్యతిరేకంగా పోరాడిన నాయకుడుచంద్రయ్య అని అన్నారు. పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడే వారని, ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎండి.రబ్బాని, మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్,ఖమ్మం రాములు, సిపిఎం నాయకులు కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ, పసుపుల చెన్నయ్య కర్నాటి యాదయ్య ముసుకు బుచ్చిరెడ్డి, విశ్వనాథ చారి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం వర్ధంతి

నవతెలంగాణ- మిర్యాలగూడ రూరల్

భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని జనయేత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ భారతదేశానికి అబ్దుల్ కలాం చేసిన సేవలను కొనియాడారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు దైద శ్రీనివాస్, నాయకులు ఎస్కే రూహీద్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి ఇలా..వెళ్లేదెట్లా..?

- కంకర తేలిన నార్కట్ పల్లి - మండ్రా రహదారి
- నిధులు మంజూరైన... నిర్లక్ష్యమే..
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

నవతెలంగాణ - నార్కట్‌పల్లి



అభివృద్ధికి చిహ్నాలు రహదారులు.. ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉంటే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతాయి అనేది నానుడి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం పూర్తి అయ్యింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో , నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా రోడ్డు సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

మండల పరిధిలోని మాండ్ర గ్రామానికి నార్కట్ పల్లి మండల కేంద్రం నుంచి వెళ్లాల్సిన రహదారిపై గుంతలు పడి కంకర తేలి ప్రమాదకరంగా మారింది. రవాణా వ్యవస్థ లేకపోవడంతో ద్వి చక్రవాహనాలపై వెళ్లి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఈ పరిస్థితిపై గ్రామస్తులు పదకొండేండ్లుగా ఆ గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారుల కు ఆందోళనలు చేసి ,మొర పెట్టుకోవడంతో నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నేటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఈ రహదారిపై ప్రయాణం నరకయాతనగా మారింది.

నిధులు మంజూరైనా... నిర్లక్ష్యమే


మండల పరిధిలోని మాండ్ర గ్రామానికి నార్కట్ పల్లి మండల కేంద్రం నుంచి ఏడు కిలోమీటర్ల దూరం బ్లాక్ టాప్ రోడ్డును గత 13 ఏండ్ల క్రితం నిర్మించారు. నిర్మాణం జరిగిన కొద్ది రోజులకి ఈ రహదారి మొత్తం ధ్వంసమైంది. మండ్ర గ్రామ శివారులో సోలార్ పరిశ్రమ ఏర్పాటు భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిస్థాయిలో ధ్వంసమై కంకర తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో అధికారులు ఎమ్ఆర్ఆర్ పథకంలో రోడ్డు నిర్మాణానికి రూ.87 లక్షలు మంజూరు చేశారు. పనులు వేగవంతం చేసేందుకు అధికారులు ఇప్పటికే టెండర్ ప్రక్రియను సైతం పూర్తి చేశారు. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ పనులు ప్రారంభం కావడం లేదు. కాంట్రాక్టర్ అతని వేరే పనుల్లో నిమగ్నమై పట్టించకపోవడంతో ఈ రహదారిపై ప్రయాణం ఆ గ్రామస్తులకు ప్రాణగండంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

11 ఏండ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం
ప్రజ్ఞాపురం లింగస్వామి



13 ఏండ్ల క్రితం రోడ్డు నిర్మాణం చేశారు. కొద్ది రోజులకే గ్రామ శివారులో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై భారీ వాహనాలు రాకపోకలతో రోడ్డు ధ్వంసమై 11 ఏండ్లుగా నరకయాతన అనుభవిస్తున్నాం ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

ఈ రహదారిపై ప్రయాణం ప్రాణాంతకం
బడుగు వెంకటేష్, కార్మికుడు



నార్కట్పల్లి మండ్ర రహదారి పై ప్రయాణం ప్రాణాంతకంగా మారింది మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు అడపాదడపా నడిచే ఆటోలు లో ప్రయాణం చేస్తే కడుపులో పేగులు గొంతులోకి వచ్చే విధంగా వాహనాలు ఎత్తేస్తుంటాయి. తమ ఆరోగ్య పరిస్థితి బాగాలేక ప్రతి వారం ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై వెళ్లాల్సి వచ్చినప్పుడు ఈ ప్రయాణంతో నడుము నొప్పి వచ్చేసింది. వెంటనే ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి కాంట్రాక్టర్ తో పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు నోటీసులు ఇచ్చాం
పంచాయతీరాజ్ డివిజన్ ఇంజనీర్ రచ్చ మహేష్

నార్కట్ పల్లి -మండ్ర గ్రామానికి 7 కిలోమీటర్లు రహదారి నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం 87 లక్షల రూపాయలు మంజూరు చేసింది ఇప్పటికే టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశాము. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదు. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ సంకినేని దుర్గారావుకు నోటీసులు జారీ చేశాం. త్వరలోనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-చివ్వెంల



పర్యావరణ పరిరక్షణ అందరిబాధ్యత అని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళారాణి , ఏపీవో నాగయ్య ఈసీ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి రజినీ, టీఏ విజయ్ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వంతో మూగజీవాన్ని కాపాడిన రిపోర్టర్

నవతెలంగాణ-నాగారం





గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయాలపాలై పత్తి చేనులో పడి ఉన్న మూగజీవం నక్కను శనివారం ఉదయం గుర్తించిన స్థానిక రిపోర్టర్ వంగూరి అంజి మానవత్వంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చేంతవరకు దానిని కాపాడి ఫారెస్ట్ నాగారం సర్కిల్ ఎస్సై వెంకట్,బీట్ ఆఫీసర్ మురళి, వాచ్ వెంకన్నకు నక్కను అప్ప జెప్పారు. అనంతరం మూగజీవాన్ని సూర్యాపేటకు తరలించి శస్త్ర చికిత్స నిర్వహించినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ వీరన్న,ఎల్లయ్య, శేఖర్,స్థానికులు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- లేకపోతే చలో హైదరాబాద్ నిర్వహిస్తాం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ ముట్టడి, విద్యార్థులు
- పోలీసుల మధ్య తోపులాట, ఉద్రిక్తం

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని , రాష్ట్రంలో 6 సంవత్సరాలు నుండి పెండింగ్‌లో ఉన్న 8,215.57 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్స్,స్కాలర్ షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శనివారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా పాలన మారలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ ఉంచినట్లే వేలాది కోట్లు రుపాయాలు ఫీజులను ప్రభుత్వం పెట్టిందని, పేద విద్యార్థులు 14 లక్షల మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం దరఖాస్తు చేసుకుంటున్న ఫీజులు విడుదలచేయడం లేదన్నారు. తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేయాలని, బడ్జెట్ సవరించి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని కేటాయించి ప్రభుత్వ ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో వరుస గురుకులాల విద్యార్థులు మరణాలు జరుగుతున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

పోలీసులకు,విద్యార్థులకు తీవ్ర తోపులాట

రెండు గంటల పాటు కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించిన విద్యార్థులు అధికారులు, కలెక్టర్ స్పందించాలని గేట్లు ఎక్కి లోపలకు చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నం చేశారు.ఈ క్రమంలో విద్యార్థులకు, పోలీసులకు తీవ్ర తోపులాట జరిగింది. దీంతో దిగివచ్చిన కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి విద్యార్థుల వద్ద నుంచి వినతిపత్రాన్ని తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి వినోద్ , జిల్లా ఉపాధ్యక్షులు అక్కెనపల్లి వినయ్, కంపసాటి విష్ణు, ధారవతష తన్వేష్, జిల్లా సహాయ కార్యదర్శి పులుసు శ్రవణ్, యాతాకుల ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు అఖి, సమన్,అనిల్, ఎం.శ్రవణ్, నవ్య, శృతి, సంధ్య కళాకారుడు పిండిగ గోపి పాల్గొన్నారు.

అద్దెభవనాల్లో గ్రామపంచాయతీలు

- అరకొర వసతుల మధ్య గ్రామ పంచాయతీ భవనాలు
- అందులో కొన్ని శిథిలావస్థలో
- మరమ్మతులకు నోచుకోని మరికొన్ని భవనాలు
- అద్దె భవనాల్లో 201 గ్రామ పంచాయతీలు
- కొత్త గ్రామ పంచాయతీలకు లేని సొంత భవనాలు

నవతెలంగాణ-సూర్యాపేట



జిల్లాలో గల గ్రామ పంచాయతీల భవనాలు శిథిలావస్థలో ఉండటంతో అరకొర వసతుల మధ్య పరిపాలన కొన సాగుతుంది.రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత పరిపాలన సౌలభ్యం కోసం నూతన పంచాయతీలను ఏర్పాటు చేశారు. భవనాలు నిర్మించక పోవడంతో అద్దె ఇళ్లల్లో కార్యాలయాలను కొనసా గిస్తున్నారు. పాత పంచాయతీలూ శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అరకొర వసతుల నడుమ పాలన సాగించాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది.

జిల్లా వ్యాప్తంగా 23 మండలాలలో 475 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ క్రమంలో గ్రామ పంచాయతీల భవనాలను పరిశీలిస్తే గతంలో 475 గ్రామ పంచాయతీల భవనాలలో నేటికి 201 గ్రామ పంచాయతీలు అద్దె భవనాల్లో నే కొనసాగుతున్నాయి. ఇందులో మెజార్టీ గ్రామ పంచాయతీలు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రధానంగా మెజారిటీ గ్రామ పంచాయతీ భవనాలలో పలు సమస్యలు పాగా వేశాయి. ఈ క్రమంలో దాదాపుగా వందకు పైగా గ్రామ పంచాయతీ భవనాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అదేవిధంగా మరికొన్ని గ్రామపంచాయతీల భవనాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రధానంగా గత కొన్ని సంవత్సరాలుగా ఆనాటి గ్రామ పంచాయతీలు పురాతన భవనాలలో కొనసాగుతున్నాయి. ఇవి రాను రాను పురాతనమైనదిగా రూపాంతరం చెంది శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దాదాపుగా 100 కి పైగా గ్రామపంచాయతీ భవనాలు మరమ్మత్తులకు నోచుకోక పోవడంతో పలుసమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీలు మాత్రం 50 సంవత్సరాలు పైగా భవనాలలో కొనసాగుతుండటంతో అవి ఏ సమయాన కూలుతాయా అనే భయాందోళనలో అధికారులు,ప్రజలు ఉన్నారు. ఫిబ్రవరి నెల నుండి సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో దాదాపుగా ఐదు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. ఈ క్రమంలో 14వ ఆర్థిక సంఘం నిధులకు కూడా ఫ్రీజింగ్ పడటంతో అభివృద్ధి కుంటుపడింది. శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

కొన్ని శిథిలావస్థలో భవనాలు ఉండటంతో వాటిని కూల్చి నూతన భవనాలు నిర్మించుకుంటామని నిధులు మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులు పీటీడీఆర్‌డీఏకు ప్రతిపాదనలను పంపారు. కానీ నేటికి కూడా వాటినుండి నిధులు విడుదల కాలేదు .దీంతో పాత గ్రామ పంచాయతీ భవనాలు మరమ్మతులకు నోచుకోక.. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాక.. వాటి పరిస్థితి అవసాన దశలో ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు భవనాల కేటాయింపు విషయంలో జిల్లా అధికారులు అవస్థలు పడ్డారు. పలుచోట్ల ద్వాక్రా భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, పశువుల ఆసుపత్రి, అంగన్వాడీ భవనాలు, ప్రైవేటు భవనాలలో నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి పరిపాలన ప్రారంభించారు. ఒకే భవనంలో రెండు ,మూడు డిపార్టుమెంట్‌లకు చెందిన శాఖలు ఉండటంతోపాటు గ్రామపంచాయతీ కూడా అందులోనే ఉండటంతో అధికారుల తోపాటు ప్రజలు ఇబ్బందులకు గురవు తున్నారు. అదేవిధంగా 201 చోట్ల గ్రామప ంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండటంతో వాటికి నెల నెలా అద్దె చెల్లించ డంలో సంబంధిత అధికారులు జాప్యం చేస్తున్నారు. అందుకు సంబంధించిన భవన యజ మానులు ఖాళీ చేయాలని చెబుతుండడంతో ఎటు వెళ్లాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రూ.20.40 కోట్లు మంజూరు

గతేడాది జిల్లాలో 102 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున ఉపాధి హామీ చట్టం కింద రూ.20.40 కోట్ల నిధులు కేటాయించారు. పనుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో ఆయా పంచాయతీ కార్యాలయాల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నత్తనడకన పనులు

జిల్లాలో మంజూరైన 102 పంచాయతీ భవనాల్లో 80 భవనాల పనులను ప్రారంభించారు. కొన్ని పంచాయతీల్లో తుది దశకు చేరుకోగా.. మరికొన్నింట్లో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. 22 పంచాయతీల్లో ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. స్థలం కొరత ప్రధాన సమస్యగా మారింది. పనులు ప్రారంభమైన చోట చాలా వరకు నెమ్మదిగా జరుగుతున్నాయి. ఇటీవల షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా తండాల్లో కొత్తగా పంచాయతీ భవనాల కోసం నిధులు కేటాయించారు. వీటి పనులు ప్రారంభించాల్సి ఉంది.

సర్పంచ్ లు లేక ఇబ్బందులు...

పుండు మీద కారం చల్లినట్లుగా సర్పంచ్ లు లేకపోవడంతో గ్రామ పంచాయతీలలో పరిపాలనా బాధ్యత గ్రామ కార్యదర్శులే నిర్వర్తిస్తున్నారు. దీంతో గ్రామాల్లో మరిన్ని సమస్యలు ఆయా గ్రామ ప్రజలను వెంటాడుతున్నాయి. సమస్యల కుప్పలతో పాటు అద్దె భవనాల సమస్య, పురాతన భవనాల అస్తవ్యస్తం తదితర వాటితో పాటు నిధులు మంజూరు కాక పాత భవనాల లోనే గ్రామపంచాయతీ పరిపాలన ప్రతినిత్యం బిక్కుబిక్కుమంటూ కొనసాగుతుంది. . పల్లెలు పట్టుగొమ్మలు అని పలు ప్రసంగాలలో నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉదర కొడుతున్నారే తప్ప కనీసం పంచాయతీల ఏర్పాటుకు నూతన భవన నిర్మాణాలను చేపట్టడంలో మాత్రం విఫలమవుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామ పంచాయతీలకు రెండు,మూడు నెలల్లో ఎన్నికలు జరిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.త్వరలోనే గ్రామ పంచాయతీలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు గ్రామ పంచాయతీల సమస్యలతో పాటు నూతన భవన నిర్మాణాలు, మరమ్మతులు తదితర వాటిని చేపట్టి గ్రామాభివృద్ధికి పాటుపడాలని పలు గ్రామలకు చెందిన ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- 15 రోజులలో ప్రతి దరఖాస్తును పరిష్కరించాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

నవతెలంగాణ-సూర్యపేట కలెక్టరేట్



పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను 15 రోజులలో ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరమంలో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారం పై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి వివిధ మాడ్యుల్స్ లో దాఖలైన దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని సంబంధిత ఆర్డీవోలకు, తహసీల్దార్లకు కలెక్టర్ సూచించారు. రెండు వారాల్లో పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.కోర్టు కేసులు, లోకాయుక్త కేసులో ఉన్న వాటిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా గ్రామాలలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా వాహనాలను సీజ్ చేసి ఆర్డీఓ ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపాలని తహసీల్దార్లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బిఎస్ లత,ఆర్డీవో లు సిహెచ్. సూర్యనారాయణ, డి శ్రీనివాస్లు, వేణు మాధవ్ రావు, శ్యామ్ సుందర్‌రెడ్డి, ఆంజనేయులు, సంఘమిత్ర, హేమమాలి,తాసిల్దరులు,అధికారులు పాల్గొన్నారు.

రవాణా కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

- ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్

నవతెలంగాణ-సూర్యాపేట



రవాణా కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వము స్పందించాలని ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు డిమాండ్ చేశారు.శనివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం లో సట్టు యాదగిరి అధ్యక్షతన జరిగిన ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.రాజస్థాన్ రాష్ట్ర తరహాలో తెలంగాణలో కూడా ఆటో డ్రైవర్స్, క్యాబ్ డ్రైవర్స్ స్విగ్గి,జొమాటో కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టో లో పెట్టిందన్నారు. కానీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా దాని ఊసు ఎక్కడ లేదని విమర్శించారు. ఆర్టీసీ బస్సు లలో మహిళలకు ఉచిత ప్రయాణం రాష్ట్ర ప్రభుత్వం కల్పించటం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయినారని, వారికి నెలవారీగా ఆర్థిక సహకారం అందిస్తామని ప్రభుత్వం తెలియజేసిందని కానీ బడ్జెట్ లో ఆటో కార్మికుల ప్రస్తావన లేదన్నారు. ఆర్టీసీ లో పెరుగుతున్న ప్రయాణికుల అవసరాల మేరకు బస్సుల సంఖ్య పెంచాలని, సిబ్బంది నియామకం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ కార్మికులపై పని భారాలను తగ్గించి, 2013సంవత్సరం వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశం లో జిల్లా కమిటీ సభ్యులు యస్.డబ్ల్యు యఫ్ సూర్యాపేట డిపో కార్యదర్శి ఉప్పు లక్ష్మణ్,డేవిడ్, కిషోర్, సతీష్, లింగయ్య, రాజు, సత్యనారాయణ, సలీమ్, జానీ సంతోష్,వెంకటేశ్వర్లు,లక్ష్మయ్య వెంకట రెడ్డి, రాజారత్నం, గోవర్ధన్ పాల్గొన్నారు.

గొల్ల కురుమలను విస్మరించిన కాంగ్రెస్

- జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య

నవతెలంగాణ-తిరుమలగిరి



గొల్ల కురుమల సంక్షేమానికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పెంపకం దారులకు గొల్ల కురుమలకు మొండి చేయి చూపుతుందని గొర్రెలు మేకలపెంపకందార్ల సంఘం (జిఎంపిఎస్) సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2,91,191 కోట్ల బడ్జెట్లో గొల్ల కురుమలకు గొర్రెల పెంపకందారులకు నయాపైస నిధులు కేటాయించలేదన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ పూర్తి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని,ఆరు నెలలు పూర్తయినప్పటికీ గొర్రెల పంపిణీ ప్రారంభించలేదన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించి ప్రారంభిస్తారని ఆశతో ఎదురుచూస్తున్న గొల్ల కురుమలకు కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపిందన్నారు. యాదవ కార్పొరేషన్‌కు 50 కోట్లు కేటాయించినట్లు చూపుతున్నప్పటికీ ఈ నిధులు ఎలా ఖర్చు చేస్తారనే వివరణ లేదన్నారు. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖకు (పశుపోషణ, మత్స్యశాఖకు కలిపి) 1,980 కోట్లు కేటాయించినట్లు చూపెట్టారు. ఈ డబ్బులు ఆ శాఖల ఉద్యోగులు , సిబ్బంది వేతనాలకే పోతాయని, మిగిలిన వాటిలో వెటర్నరీ యూనివర్సిటీకి, శాఖలోని సాధారణ నిర్వహణ ఖర్చులకు, పశువుల మందుల కొనుగోలుకు కూడా ఈ నిధులు సరిపోయే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులకు సవరణలు చేసి గొర్రెల పంపిణీ పథకానికి కావలసిన నిధులు ఇచ్చి ఎప్పటినుండి ప్రారంభిస్తారో ఈ సమావేశాల్లోనే స్పష్టతనివ్వాలన్నారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-సూర్యాపేట



కొత్తగా వచ్చిన మహిళా చట్టాల ప్రాముఖ్యత వాటి తీవ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ సర్వీస్ అథారిటీ వసంత సత్యనారాయణ పిళ్లై అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో డీఎల్ఎస్ఏ వారితో కలిసి శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో మహిళా చట్టలపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సైబర్ నేరాలు పెరుగుతున్నందున సెల్ ఫోన్ వినియోగం పట్ల జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ చైతన్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటరత్నం ,వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, షీ టీం ఎస్ఐ నీలిమ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వాణి పెండెం, సీనియర్ అడ్వొకెట్ ధావుల వీరప్రసాద్, భరోసా లీగల్ కౌన్సిలర్ జ్యోతి, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వినోద్, సఖి హేమలత, ఫైనాన్సియల్ లీటరసి తేజస్విని, సఖి సుజాత, భవ్య, కళాశాల సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలసభ దోహదం

నవతెలంగాణ-తుంగతుర్తి

బాలసభ కార్యక్రమం విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని వెంపటి ప్రాథమిక పాఠశాలప్రధానోపాధ్యాయులు పాలకుర్తి ఎల్లయ్య అన్నారు. శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా నిర్వహించిన బాలసభనద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సృజనాత్మక కార్యక్రమాలైన పాటలు పాడడం, ఉపన్యాసాలు, ఏకపాత్రాభినయం, నాటికలు, జోకులు, కథలు పద్యాలు, గేయాలు, పొడుపు కథలు, అభినయ గేయాలు, సామెతలు చెప్పి ఆశ్చర్యపరిచారు. అనంతరం క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. బాలసభకు కమాండర్‌గా ఐదో తరగతి విద్యార్థిని గౌడిచర్ల ఆరాధ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మల్లెపాక రవీందర్, గుండ్ల ఆంజనేయులు, రమాదేవి, అబ్బగాని మంజుల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులేవి

నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో ఆర్యవైశ్యులకు తీరని అన్యాయం జరిగిందని శ్రీ వాసవి సేవా సమితి జిల్లా కన్వీనర్ బచ్చు పురుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అందుకు ఆ పార్టీలో ఉన్న ఆర్యవైశ్యులు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్యవైశ్యులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్న తరుణంలో బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దారుణం అని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల్లో ఎంతోమంది నిరుపేదలు ఉన్నారని వారికి కార్పొరేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం కు ఆర్యవైశ్యులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఆర్యవైశ్య కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని పేర్కొన్నారు.

గీతవృత్తిని ప్రభుత్వం ప్రోత్సహించాలి

నవతెలంగాణ-చిలుకూరు

గీత వృత్తిని తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రోత్సహించాలని గీతాపనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ కోటయ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలోని దొడ్డనర్సయ్యభవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.1957వ సంవత్సరంలో మహబూబాబాద్ జిల్లాలోని గార్లపట్టణంలో మాజీ ఎంపీ బొమ్మ గాని ధర్మభిక్షం నాయకత్వంలో గీతాపని వారాల సంఘాన్ని ఏర్పాటు చేయబడినదన్నారు.అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేస్తే నాటి నుండి నేటివరకు గీతపని వారాల సంఘం బలోపేతానికి కృషి జరుగుతుందన్నారు. సంఘానికి ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షే మపథకాల గురించి ఈనెల 28వ తేదీన సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో జిల్లా నిర్మాణం ఏర్పాటు చేస్తామన్నారు. సమా వేశానికి రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ గాని ప్రభాకర్ హాజరవుతున్నందున అందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కటికోలనాగేశ్వరావు, కొండా వెంకయ్య, బెల్లంకొండబాబు, ఎం.లక్ష్మీనారాయణ, కొండాశేషయ్య, బాలేబోయిన, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

30న 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మునగాల

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం కోరారు. శనివారం మండలంలోని నేలమర్రిలో నిర్వహించిన జీపీ కార్మికుల సమావేశంలో మాట్లాడారు.ఏండ్ల తరబడిగా పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పాలకులు మారినా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు తీరలేదన్నారు.జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కారోబర్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వెంకన్న, సుందరయ్య, నాగేంద్ర, పార్వతి, యంగలి పాపయ్య పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు నిధులు కేటాయించడం పట్ల హర్షం

నవతెలంగాణ-తిరుమలగిరి

కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి రాష్టబడ్జెట్‌లో 2024-25 సంవత్సరానికి 3003 కోట్లు ఇచ్చి పెద్దపీట వేయడం సంతోషకరమని కాంగ్రెస్ మైనార్టీ సెల్ నియోజకవర్గ చైర్మెన్ ఎండి హాఫిజ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీ లకు 2014 నుండి 2023 లో 2050 కోట్లు ఒకసారి 2200 కోట్లు కేటాయించిందని కానీ మొత్తంగా 500 కోట్లు కూడ కర్చుపెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సంక్షేమానికి ఇంత పెద్దపీట అని తెలంగాణ ముస్లిం మైనారిటీ లకూ పెద్ద శుభవార్త అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ,ఫైనాన్స్ మినిస్టర్ మల్లు భట్టివిక్రమార్కకు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

గొప్ప మహనీయుడు అబ్దుల్‌కలాం

నవతెలంగాణ-కోదాడరూరల్



భారత దేశ శాస్త్ర సాంకేతిక రంగాలకు విశిష్ట సేవలు అందించి దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అని పలువురు పట్టణ ప్రముఖులు పేర్కొన్నారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా విజయీభవ ట్రస్ట్, స్వర్ణభారతి ట్రస్ట్, ఇరుకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీపార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప శాస్త్రజ్ఞుడు అని, రాష్ట్రపతిగా అన్ని వర్గాల ప్రజల మన్ననలను అందుకుని ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న గొప్ప వ్యక్తి అన్నారు.నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకొని వారు చూపిన బాటలో నడవాల న్నారు.ఈ కార్యక్రమంలో స్వర్ణభారతి ట్రస్ట్ అధ్యక్షులు గాదంశెట్టి శ్రీనివాసరావు, ఇరుకుళ్ల ఫౌండేషన్ అధ్యక్షులు ఇరుకుళ్ల చెన్నకేశవరావు, యాదసుధాకర్, పుల్లకాండం సాంబశివరావు, గుడుగుంట్లసాయి, పైడిమర్రిరామారావు, జగని ప్రసాద్, రాయపూడి వెంకటనారాయణ, వెంపటి వెంకటేశ్వర్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్ల పోస్టులను వెంటనే నియమించాలి

నవతెలంగాణ-చిలుకూరు



ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ పోస్టులను వెంటనే నియామకం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బంధంవెంకటేశ్వర్లు, ఓరుగంటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది ఎస్టీయూ మాత్రమేనన్నారు.ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను సప్లై చేయాలన్నారు అనంతరం ఎస్టీయూ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సురగానిలింగయ్య అంకిరెడ్డినాగిరెడ్డి,కొండ రామాంజనేయులు, కొండ వీరబాబు, మందిగొండ నరేష్, వుట్టపాక నర్సింహారావు,అనంతరామారావు, గురువారెడ్డి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- మున్సిపల్‌చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-భువనగిరిఅర్బన్

వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు.భువనగిరి పట్టణ కేంద్రంలోని మీనానగర్‌లో శనివారం ఇంటింటికి మొక్కలు పంపిణీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఇంటింటికి మొక్కలు నాటాలన్నారు.భువనగిరి పట్టణంలో దాదాపు రెండు లక్షల మొక్కలు నాటడం కోసం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కైరంకొండ వెంకటేష్, కాంగ్రెస్ పట్టణఅధ్యక్షులు కూర వెంకటేష్, పాలిశెట్టి అనిల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైకా చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-రాజపేట

రాష్ట్ర ట్రైకా చైర్మెన్ తేజావత్ బెల్లయ్యనాయక్‌ను శుక్రవారం చాంబర్‌లోయాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ఎస్టీసెల్ చైర్మన్ రాంజీనాయక్ చౌహాన్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ట్రైకాచైర్మెన్‌కు ఆ బృందం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు సన్మాని ంచింది. ఈ కార్యక్రమంలో విట్టల్ నాయక్, కాంగ్రెస్ పుట్టగూడెంతండా గ్రామఅధ్యక్షుడు భూక్యా నర్సింహానాయక్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బాపాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని మల్యాల గ్రామంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో జిల్లా స్థానికసంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో వంట గదిని, మరుగుదొడ్లు, మూత్ర శాలను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వంటగదిలో నిల్వ ఉన్న కూరగాయలను, ఆహార ధాన్యాల నాణ్యతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.అనంతరం అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రాథమికఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పలు ఆవరణంలోనూ మొక్కలు నాటారు.ఆయన వెంట ఎంపీడీవో రాజా త్రివిక్రమ్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



బీసీ కులగణన చేపట్టి స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-రాజపేట

బీసీ కులగనన చేపట్టిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం, వివిధ కుల సంఘాలు, రాజకీయ పక్షాల నాయకులు డిమాండ్ చేశారు.శనివారం రాజపేట మండల కేంద్రంలోని గాంధీ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాయి.ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ మండలఅధ్యక్షులు సట్టు తిరుమలేష్, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమాం మాట్లాడారు.కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి బీసీ రిజర్వేషన్ల పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.న్యాయపరమైన చిక్కులను అధిగమించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు కేంద్ర బడ్జెట్లో బీసీలను విస్మరించడం తీవ్ర విచారకరమన్నారు.కాంగ్రెస్ ఎన్నికల హామీని విస్మరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నేత మోత్కుపల్లి నవీన్‌కుమార్, దళితహక్కుల పోరాట సమితి నేత ఇప్పలరమేష్, బీసీ కులసంఘాల నేతలు గొల్లపల్లి సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.



సైకిళ్లపై పోలీసుల పర్యవేక్షణ

నవతెలంగాణ-రాజపేట

మండలకేంద్రంలో పోలీసులు శనివారం సైకిళ్లపై పర్యటిస్తూ పరిస్థితులను పర్యవేక్షించారు.ఎస్సై నాగుల ఉపేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ ప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ యాదగిరిలు గ్రామంలో పర్యవేక్షణ జరిపారు. మూడు సైకిళ్లు ఇవ్వగా, వాటిపై గ్రామంలో పర్యవేక్షణ జరపాలని సీపీ ఆదేశాలు ఉండగా రాజపేట పోలీసు బృందం ఆచరిస్తుంది. సైకిల్‌పై గ్రామంలో పర్యటిం చడంతో ప్రజలకు మరింత చేరువ కావడంతోపాటు ఆరోగ్యం, వ్యాయామం ఉంటుం దన్నారు. ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు పెరగడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతోందన్నారు.తమ వృత్తి పట్ల ప్రజలకు మరింత గౌరవం పెరిగిందన్నారు. పోలీసులు సైకిల్‌పై గ్రామంలో తిరగడం పట్ల ప్రజలు అన్ని పార్టీల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఫ్రెండ్లీ పోలీస్ లక్ష్యసాధనలో ఇది బాగా తోడ్పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



రామకృష్ణ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన మిర్యాల రామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం రామకృష్ణ చిత్రపటానికి సర్పంచులఫోరం మాజీ అధ్యక్షులు గంగుల వెంకటరాజారెడ్డి పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరా మర్శించారు.అనంతరం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పున్న జగన్మోహన్, జినుకల ప్రభాకర్, గుత్తా నర్సింహారెడ్డి, ఎండి అక్రమ్, సుక్క శ్రవణ్ కుమార్, అప్పం గోయల్, తదితరులు ఉన్నారు.

వివేకానంద యూత్ ఆధ్వర్యంలో పాఠశాల సుదర్శన

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో వివేకానంద యువజనసంఘం ఆధ్వర్యంలో శనివారం హై స్కూల్‌ను సందర్శించారు. జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు స్కూల్లో ఉన్న తాగునీటి గురించి, వారి యొక్క విద్యాభ్యాసాని గురిం, క్రీడల గురించి ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్ తో విద్యార్థిని విద్యార్థుల చదువు పట్ల,క్రీడల పట్ల శ్రద్ధ చూపించి వాళ్ళని జాతీయస్థాయి క్రీడాపోటీలలో పాల్గొనేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివేకానంద యువజనసంఘం అధ్యక్షులు బల్ల యాదేశ్, ప్రధాన కార్యదర్శి బింగిశివకుమార్, సభ్యులు ఎంగల్‌దాస్ యాదగిరి,కటకం గణేష్,బల్ల మహేష్,గోలి కిరణ్ పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని వినతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ జూలై 27 న అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా శనివారం అసెంబ్లీ మెయిన్‌గేటు ముందు,ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ సభ్యులు పనుపునూరి వీరేశం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మెమొరాండం స్వీకరించిన ప్రభుత్వ విప్ ఆలేరు ను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యే విధంగా కృషి చేస్తాననీ,సాధించి తీరుతామని హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆలేరు రెవెన్యూ డివిజన్ పోరాట కమిటీ సభ్యులు ఆర్.జనార్ధన్, మొరిగాడి చంద్రశేఖర్,చెక్క వెంకటేశ్, కేమిడి ఉప్పలయ్య, ఇక్కిరి సహదేవ్,పద్మ సుదర్శన్,తుంగ కుమార్, పంగ రవి, కామిటికారి అశోక్,ఎం. డీ.సలీం,బాంబే రవి,నంద గంగేష్,జూకంటి శంకర్, రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ సభ్యులు ఉన్నారు.



శిక్ష సత్తా కార్యక్రమంలో మొక్కలు నాటిన విద్యార్థి, తల్లి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలకేంద్రంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాల ఆవరణలో, శిక్ష సత్త, ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా తల్లి, (విద్యార్థి) బిడ్డతో వివిధ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ఏకో క్లబ్ ఆధ్వర్యంలోనిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొక్కల ప్రాముఖ్యత మానవజాతికి అవసరమైన ప్రాణ వాయువు మొక్కలు నాటడం ద్వారానే సాధ్యమైతుందన్నారు.ఈ కార్యక మంలో ప్రధానోపాధ్యాయులు మంజుల, తల్లులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



భూనిర్వాసితులపై ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

- సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు

నవతెలంగాణ-వలిగొండ

భూనిర్వాసితులపై ప్రభుత్వం మొండివైఖర్ని వీడనాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గసభ్యులు మాటూరి బాలరాజు డిమాండ్ చేశారు.శనివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) పోరుబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ క్రమంలో స్థానిక రైతువైదికలో గౌరెల్లి-భద్రాచలం భూనిర్వాసితులతో నిర్వహించిన సమావేశానికి ఆర్డీఓ హాజరయ్యారు.ఆర్డీఓను సీపీఐ(ఎం) నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాటూరి బాలరాజు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శి సిర్పంగిస్వామి మాట్లాడారు.మండలపరిధిలోని గౌరెల్లి-భద్రాచలం, ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో అనేకమంది పేదల,చిన్న సన్నకారు రైతులు భూములు కోల్పోతున్నారన్నారు.ప్రభుత్వం వారికి ఇచ్చే పరిహారం కేవలం రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం ఇవ్వడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.ప్రభుత్వం వెంటనే బహిరంగ మార్కెట్‌లో భూములకున్న విలువను ఆధారం చేసుకుని మూడు రెట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను విడదీస్తూ వారిని ఐక్యం కాకుండా ఒకేసారి నిర్వాసితులతో సమావేశాలు నిర్వహించకుండా కేవలం రెండు,మూడు గ్రామాలతో సమావేశాలు నిర్వహించిన వారిని మోసం చేస్తుందన్నారు.రైతులందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఒక గ్రామంలో ఉన్న భూములకు ఒకే రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ధర లేదని దీనివల్ల ఒకే గ్రామంలో రైతులు రెండు మూడు రకాల పరిహారాన్ని అందుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు.ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేసి బహిరంగ మార్కెట్‌ధర ప్రకారం మూడురెట్ల పరిహారం చెల్లించాలని కోరారు.ప్రభుత్వం భూములు కోల్పోతున్న భూనిర్వాసితులందరికీ భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నిలువునా ముంచే ఈ చర్యలను వెంటనే మానుకోవాలని స్థానిక ఎమ్మెల్యే,ఎంపీలు నిర్వాసితుల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు.మండలవ్యాప్తంగా నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు వెంకటేశం చీర్క శ్రీశైలంరెడ్డి,కలకూరి రామచందర్ ,సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, వాకిటి వెంకటరెడ్డి,బుగ్గ చంద్రమౌళి,దుబ్బలింగం, కవిడే సురేష్,కల్కూరిముత్యాలు, భీమనబోయిన జంగయ్య, నాయకులు దొడ్డి భిక్షపతి, దయ్యాల సత్యరాములు, కొమ్ము స్వామి, వేములనాగరాజు, కందకట్ల సాయిరెడ్డి, బందారపు ధనంజయ, కొమ్మిడి సత్తిరెడ్డి, వరికుప్పల శంకరయ్య, నారి రామస్వామి, వేముల లక్ష్మయ్య, ఉంద్రాటి పాపయ్య,ఆలకుంట్ల నర్సింహ, మారబోయిన ముత్యాలు, పోలేపల్లి పెద్ద స్వామి, సలిగంజి మురళీకృష్ణ, ఇమ్రాన్, రైతులు, నిర్వాసితులు పాల్గొన్నారు.



దోపిడీ అంతం కావాలంటే సామాజిక సమస్యలపై పోరాటం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్
- రామన్నపేటలో ఉత్సాహపురితంగా ప్రారంభమైన రాజకీయ శిక్షణా తరగతులు

నవతెలంగాణ-రామన్నపేట

సామాజిక సమస్యలపై కార్మిక వర్గదృక్పథంతో ఉద్యమించిన నాడే దోపిడీ అంతమవుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో సీఐటీయూ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు అత్యంత ఉత్సాహపూరితంగా ప్రారంభమయ్యాయి. తరగతుల ప్రారంభ సూచికగా జిల్లా అధ్యక్షులు దాసరి పాండు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు.అనంతరం అమరవీరులకు జోహార్లు అర్పించారు. శిక్షణాతరగతులకు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ శిక్షణా తరగతులను ప్రారంభించి 'సామాజిక సమస్యలు - కార్మికవర్గ దృక్పథం' అనే అంశంపై మాట్లాడారు. సమాజంలో అనాదిగా వస్తున్న అంతరాలను రూపు మాపేందుకు కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలన్నారు.కులం, మతం, అంతరాలపేరుతో కార్మికులను పాలకవర్గాలు, పెట్టుబడిదారులు విచ్ఛిన్నం చేసి ఆర్థిక, శ్రమ దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు.సమాజంలో శ్రమపాత్ర కీలకమైనదని, శ్రమకు తగిన ప్రతిఫలం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక కార్మిక ఉద్యమాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులపట్ల దోపిడి పలు రూపాల్లో పెరుగుతుందన్నారు.శ్రామిక మహిళలపై పని ప్రదేశాల్లో జరిగే వేధింపులు, పురుషాధిపత్యంపై చైతన్యంతో పోరాటం నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణా తరగతుల ఆహ్వాన సంఘం చైర్మెన్ తిరుగుడు మల్లికార్జున్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దోనూరి నర్సిరెడ్డి, యండి పాషా,గొరిగె సోములు, తుర్కపల్లి సురేందర్, సహాయ కార్యదర్శులు బోడ బాగ్య, మాయకృష్ణ, పుప్పాల గణేష్, సుబ్బూరి సత్యనారాయణ, అంగన్ వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు రమా కుమారి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జల్లెల పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామ పంచాయతీ, భవన నిర్మాణ, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, అంగన్ వాడీ, ఆశా,ఏఎన్ఎం, మధ్యాహ్నభోజన, మిషన్ భగీరథ కంపనీ, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.



సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్‌లో సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు మంజూరు కోసం శనివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి చౌటుప్పల్ బార్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రిప్రజెంటేషన్ అందజేశారు.ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఏర్పాటు కావడానికి ప్రభుత్వ నియమాలు, మార్గదర్శకాలు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు.అన్ని శాఖల డివిజన్ కార్యాలయాలతోపాటు రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీగా ఉన్న చౌటుప్పల్‌లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుచేస్తే ప్రజలకు ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వివరించారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో జిల్లా కేంద్రాన్ని మినహాయిస్తే ఏకైక రెవెన్యూ డివిజన్‌గా చౌటుప్పల్ ఉందని, అన్ని కోర్టులు ఏర్పాటుచేసుకునే విధంగా ఇప్పటికే ప్రభుత్వం ఐదెకరాల స్థలాన్ని మంజూరుచేసి జ్యూడిషియరి పొజిషన్‌లో ఉందని సీఎంకు గుర్తుచేశారు. దీంతోపాటు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు కావాల్సిన పెండింగ్ కేసులకు సంబంధించి చౌటుప్పల్ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వెంటనే లా సెక్రెటరీకి ఫోన్‌చేసి పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు తాడూరి పరమేశ్, జనరల్ సెక్రెటరీ రాపోలు శ్రీను, కోశాధికారి పడమటి జైపాల్‌రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పబ్బు రాజుగౌడ్‌తో పాటు చౌటుప్పల్ బార్ అసోసియేషన్ సభ్యులు 40 మంది పాల్గొన్నారు.



అగస్టు 10, 11వ తేదీల్లో ఆవాజ్ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు

- ఆహ్వానసంఘం అధ్యక్షులు షేక్ మీరాచౌదరి

నవతెలంగాణ-భువనగిరి అర్బన్

పట్టణంలోని దుంపలమల్లారెడ్డి స్మారక భవనంలో శనివారం ఆవాజ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతుల కరపత్రాలను ఆహ్వాన సంఘం అధ్యక్షులు షేక్ మీరా చౌదరి విడుదల చేసి మాట్లాడారు.ఆగస్టు 10, 11న శ్రీ శ్రీనివాస ఫంక్షన్ హల్ (దివ్య)లో నిర్వహించే ఆవాజ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణా తరగతులను అన్ని తరగతుల ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపి ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించేటట్లు సమాజం పట్ల యువతకు ఉన్నతమైన అవగాహన కల్పించడం కోసమే ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.భారత రాజ్యాంగం లౌకికవాదం అంశాలపై సెమినార్ ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో ఆవాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, ప్రచార కార్యదర్శి షేక్ హమీద్ పాషా, ఎస్‌కె.లతీఫ్ ఇమామ్‌పాషా, ఎండి సలీం, అబ్దుల్ రెహమాన్, జలాల్, సుజావుద్దీన్, అఫాన్, నిహాల్ జహీర్, జలీల్, ఆజంముక్తార్ పాల్గొన్నారు.



డ్రైయినేజీ, సీసీరోడ్ల నిర్మాణపనులు చేపట్టాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం కొలనుపాకగ్రామం రెండోవార్డులో ప్రభుత్వ అధికారులు వెంటనే సీసీరోడ్లు, డ్రయినేజీనిర్మాణపనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. సీసీరోడ్లు లేదని, మోరి లేక మురుగునీరు ఇండ్ల మధ్యలోకి వస్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని దీంతో దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. దోమల సంతతి పెరిగిందన్నారు. ప్రజలు కాలనీవాసులు అంటువ్యాధులు,సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని, వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కొరకు ఉద్యమిస్తామన్నారు.



ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలో రాఘవ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద , భారతరత్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పులిపలుపుల మహేష్ మాట్లాడుతూ అబ్దుల్‌కలాం పేరు తెలియని భారతీయుడు ఉండడన్నారు.మహోన్నతమైన వ్యక్తి అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, ప్రముఖ పాత్రికేయులు కుర్షిద్‌పాషా, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్డెమాను నరేందర్, స్పందన ఫౌండేషన్ చైర్మెన్ పంతం కృష్ణ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సముద్రాల శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు ఐలి సందీప్, కాంగ్రెస్ నాయకులు సుధగాని సాగర్, బీఆర్ఎస్ నాయకులు ఎండి ఫయాజ్,కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా సహాయకార్యదర్శి మొరిగాడి సిద్దులు, కన్స్యూమర్ రైట్స్ పట్టణ అధ్యక్షులు మొరిగాడి ఉపేందర్,రాఘవ స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు కళ్లెం జితేందర్, ఎండీ.నజీర్, ఎర్ర ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



రైతు కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలంలోని చందుపట్ల పీఏసీఎస్ బ్యాంకు పరిధిలో చందుపట్ల గ్రామ మహిళా రైతు చిన్నం మల్లమ్మ (90) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది.వారి కుటుంబవారసులకు బ్యాంకు తరపున రూ.30వేల ఆర్థికసాయాన్ని బ్యాంకు చైర్మెన్ మందడి లక్ష్మీ నర్సింహారెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు బల్గూరి మధుసూదన్‌రెడ్డి, సుబ్బురు. మహేందర్, సంఘం సిబ్బంది, సీఈఓ దంతూరి నర్సింహ, నల్లమాసురాములు, గుర్రం నాగరాజు, గుర్రంనర్సింహులు పాల్గొన్నారు.



రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని మర్యాల రైతువేదికలో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను ఏఈవో రాజశేఖర్ శనివారం స్వీకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన రైతులంతా ఆగస్టు 4వతేదీ లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లగుండ్లతండాలో రైతుబీమా పెండింగ్ లిస్టులను గోడలపై అతికించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

తెలంగాణా రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటించి, ఎస్సీ, ఏస్టీ శాఖల అభివృద్ధి పథకాలపై శనివారం సమీక్ష నిర్వహించారు. అనంతరం శ్రీ యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి వారిని, స్వర్ణగిరి వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునారు.ఈ కార్యక్రమములో ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి ఎస్.జైపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్, ఎస్సీ శాఖ వార్డెన్స్ పాల్గొన్నారు.



బోరు పైప్‌లైన్ రిపేర్ చేయాలి

నవతెలంగాణ-భువనగిరి అర్బన్

స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రికి నీటివసతి మీనానగర్ నుండి పైపులైన్ ద్వారా సరఫరా చేయబడుతున్నదని సీపీఐ(ఎం) పట్టణకార్యదర్శి మాయకృష్ణ అన్నారు.శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మీనానగర్‌లో పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా మారి ఇండ్లల్లోకి నీరంతా చేరుతుందన్నారు. సంబ ంధిత అధికారులు సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణనాయకులు గంధమల్ల మాతయ్య, పీఎస్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, వల్దాస్ అంజయ్య, చింతల శివ, ఈర్ల రాహుల్, వనం గిరి, ఫిష్ కే సంతోష్ పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని చిత్తాపురంకు చెందిన ఓలమాల కిష్టమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందడంతో వారి కుటుంబానికి శాసన సభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో ఏర్పాటుచేసిన రూ.5 వేల ఆర్థికసాయాన్ని వారి కుటుంబానికి శనివారం స్థానిక కాంగ్రెస్‌నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసరి వెంకటరెడ్డి, వనమాల భిక్షపతి, సోమిరెడ్డి,నర్సింహ,చిగురి పాపయ్య, లక్ష్మయ్య, లింగస్వామి, ఖలీల్,ధర్మయ్య, శీర్ల ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలకేంద్రానికి చెందిన కోయ యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.కాగా వారి కుటుంబానికి శనివారం నవభారత్ యూత్ అసోసియేషన్ వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.నవభారత్ యూత్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన సభ్యులు ,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

వికలాంగులను కించపరుస్తూ మాట్లాడిన ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్‌పై తక్షణమే చర్యలుతీసుకోవాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.చట్టాలను అమలు చేయాల్సిన ఐఏఎస్ అధికారిణి తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాల్సింది పోయి సమర్థించుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారని ఆరోపించారు.ఆమె వ్యాఖ్యలు రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయన్నారు.

బీజేపీ మండలవిస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణ-రాజపేట

మండలకేంద్రంలో బీజేపీ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పాశంభాస్కర్, జిల్లా ప్రధానకార్యదర్శి ఊట్కూరి అశోక్‌గౌడ్, ఎల్బీనగర్ ప్రభావి రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు దాచేపల్లి రాజు, ఆలేరు అసెంబ్లీ కన్వీనర్ కానుగంటి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్ మహిళా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురిచంద్ర, మాజీ మండలఅధ్యక్షులు కాయితిబాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గవ్వల సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

మౌన దీక్షను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

పెన్షనర్ల దీర్ఘకాలిక పరిష్కృత సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించనందున నిరసనగా ఈనెల 30న మౌన దీక్ష చేస్తున్నట్లు టప్రా జిల్లా అధ్యక్షులు, నూకల జగదీష్ చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సమస్యలలో ప్రధానంగా నాలుగు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని, ఆరోగ్య పథకం ద్వారా కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం అందించాలని, 2వ పీఆర్సిని వెంటనే ప్రకటించాలని, ఐఆర్‌ను 5 శాతం నుండి 20 శాతానికి పెంచాలని, కోరారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షనరి బెనిఫిట్ కు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఇందిరా పార్క్ వద్ద ఈ నెల 30 న నిర్వహించే మౌన దీక్షలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పీవోడబ్ల్యూ మహాసభను జయప్రదం చేయాలి

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలో వచ్చే నెల 5న జరిగే ప్రగతిశీల మహిళా సంఘం నల్లగొండ జిల్లా 7వ మహాసభలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పి.వో. డబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర కోరారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళకు రక్షణ కరువైందని, లైంగిక వేధింపులు, హత్యలు, హత్యాచారాలు, గృహ హింస మరింత పెరిగాయని అన్నారు. స్త్రీ పురుష సమానత్వం కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమభాగామ్యం కోసం గత అర్థ శతాబ్దంలో పిఓడబ్ల్యూ అనేక పోరాటాలు నిర్వహించిందని అన్నారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టాల కోసం వాటి అమలు కోసం పిఓడబ్ల్యూ బలమైన పోరాటాలు చేసిందని తెలియజేశారు. ఆగస్ట్ 5న నకిరేకల్ లో జరిగే పి.వో. డబ్ల్యూ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.వో డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు బూరుగు లక్ష్మమ్మ అనిత, మనెమ్మ, రాఘవమ్మా తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా 'ఫీవర్ సర్వే'

- వందల సంఖ్యలో వెలుగులోకి వస్తున్న జ్వర పీడితులు
- పరీక్షల కోసం టీ హబ్ లకు నమూనాలు పంపిస్తున్న వైద్య సిబ్బంది
- నేటికీ 9574 కేసుల గుర్తింపు



నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జ్వర బాధితులను గుర్తించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. వర్షాకాలం సీజన్ లో ప్రజలు డయేరియా, వైరల్ ఫీవర్లు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు నిండిపోతున్నాయి. వైద్యం కోసం ఖర్చు చేయడం సామాన్యులకు తలకు మించిన భారం కావడంతో రోగులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నుండి జిల్లాలోని 8 మున్సిపాలిటీలలో వైద్య సిబ్బంది గడపగడపకు తిరుగుతూ ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నారు.

జ్వర సహా ఇతర వ్యాధుల లక్షణాలను ఉన్నవారిని గుర్తిస్తున్నారు.ఫీవర్ సర్వేను నిర్వహించేందుకు వైద్య, అంగన్వాడి, మెప్మా సిబ్బందితో కలిపి ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేశారు. ఈ నెల 11వ తేదీ నుండి రూరల్ ఏరియాలో వైద్య సిబ్బంది గడపగడపకు తిరుగుతూ ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నారు. 46 మంది వైద్యాధికారులు, 16 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 23 మంది ఫార్మసిస్టులు, 91 మంది ఏఎన్ఎం లు, 1400 మందికి పైగా ఆశా వర్కర్ల తో కలిపి అధికారులు జిల్లాలో 257 టీం లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క టీం రోజుకు 50 ఇండ్ల చొప్పున సర్వే చేసి ఆయా ఇళ్లలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి రికార్డుల్లో పక్కా సమాచారాన్ని సేకరిస్తున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి అక్కడికక్కడే మందులు ఇవ్వడమే గాక జ్వరతీవ్రత ఎక్కువగా ఉన్నవారి నుండి రక్తాన్ని సేకరించి జ్వరానికి గల కారణాలను గుర్తించేందుకు నమూనాలను టీ హబ్ కు పంపిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత పై అవగాహన

పరిసరాలు పరిశుభ్రంగా లేవకపోవడం వల్ల దోమల ఉధృతి పెరిగి ప్రమాదకరమైన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఫీవర్ టీం సభ్యులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. పలు ఇండ్లలో కూలర్ లలో నిల్వ ఉన్న నీటిని, పాత డబ్బాలు, పూల కుండీలు, ములుగు కాలువలలో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని చెబుతూ పలు నివాస గృహాలలో పూల కుండీలు, పాత డబ్బాలలో నిలువ ఉన్న నీటిని దగ్గరుండి కింద పారబోయిస్తున్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, కిటికీలకు తలుపులకు మెష్ లను ఏర్పాటు చేసుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

9574 మంది జ్వర పీడితుల గుర్తింపు

నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, నందికొండ, చండూరు, హాలియా, చిట్యాల, దేవరకొండ, నగరేకల్, లలో ఉన్న అన్ని వార్డులలో ఈ సర్వే కొనసాగుతుంది.వైద్యశాఖ నివేదికల ప్రకారం ఈ సంవత్సరం ఇప్పటివరకు 9574 మంది జ్వర పీడితులను గుర్తించారు. ఇప్పటివరకు జిల్లాలో 54 డెంగ్యూ కేసులు, 4 చికెన్ గున్యా,1 మలేరియా కేసు నమోదు అయ్యాయి. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా నమోదవుతుండడంతో వైద్యశాఖ అధికారులు అంటువ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకుంటున్నారు. యాంటీ లార్వా ద్రావణాలను పిచికారి చేస్తున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

నెలవారీగా కేసుల వివరాలు

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జనవరి నెలలో 7 డెంగ్యూ కేసులు, 1554 ఫీవర్ కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో 7 డెంగ్యూ కేసులు, 1433 ఫీవర్ కేసులు, మార్చి నెలలో 8 డెంగ్యూ కేసులు, 2 చికెన్ గున్యా కేసులు, 14 64 ఫీవర్ కేసులు, ఏప్రిల్ నెలలో 7 డెంగ్యూ కేసులు, 1340 ఫీవర్ కేసులు, మే నెలలో ఐదు డెంగు కేసులు, రెండు చికెన్ గునియా కేసులు, 13 32 ఫీవర్ కేసులు, జూన్ నెలలో 12 డెంగు కేసులు, 1246 ఫీవర్ కేసులు, జూలై నెలలో నేటి వరకు 8 డెంగ్యూ కేసులు, ఒక మలేరియా కేసు, 1205 ఫీవర్ కేసులు నమోదయ్యాయి.

ముమ్మరంగా సర్వే...

డాక్టర్ కళణ చక్రవర్తి (డిఎంహెచ్ఓ నల్లగొండ)



జ్వర బాధితుల గుర్తింపు కోసం ఫీవర్ సర్వే కొనసాగుతుంది. ఈ కాలంలో డయేరియా, వైరల్ ఫీవర్ కేసులు ఎక్కువగా నమోదవుతాయి. సిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వర సర్వే తోపాటు లార్వా సర్వే కూడా చేస్తున్నారు. నేటి వరకు వైరల్ ఫీవర్లు తప్ప డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా కేసులు నమోదు కాలేదు. పాతవే 54 డెంగ్యూ కేసులు, 4 చికెన్ గునియా కేసులు, ఒక మలేరియా కేసు ఉన్నాయి. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కావలసిన వైద్య సేవలను అందిస్తున్నాం.

రూ.10 లక్షల ఆర్థికసాయం అందజేత

- సోషల్ మీడియా అద్భుతం.. ఒక కుటుంబానికి ప్రోత్సాహం



నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మిర్యాల రామకృష్ణ (38)ది చేనేత కుటుంబమైనప్పటికీ ఫొటోగ్రఫీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు.ఆయనకు భార్య సుచరిత, కుమారుడు, కూతురు, అమ్మ ఉన్నారు. పది రోజుల కింద రామకృష్ణ అకస్మికంగా మృతి చెందారు. పేద కుటుంబానికి చెందిన రామకృష్ణకు బంధుమిత్రులు, సహవృత్తిదారులు, పద్మశాలీలు, చిన్ననాటి స్నేహితులు, సహవిద్యార్థులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, సోషల్ మీడియాలోని వాట్సాప్,పేస్‌బుక్, ఇతర గ్రూపుల మానవతావాదుల ద్వారా సమకూరిన 10,74,150 రూపాయలను శనివారం ఆయన రామకృష్ణ దశదినకర్మ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ ఉన్న లక్ష్మీ జగన్మోహన్, నాయకులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచులు అప్పం లక్ష్మీనర్సు, రాపోలు నిర్మల నరసింహ, మాజీ ఎంపీటీసీలు బడుగు రమేష్, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు అప్పం రామేశ్వరం గ్రామానికి చెందిన వివిధ కులసంఘాల నాయకులు అందరూ కలిసి రామకృష్ణ కుటుంబసభ్యులకు చెక్కులను అందజేశారు.అంతకుముందు రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళు లర్పించారు.కుటుంబసభ్యులను ఓదార్చారి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోశిక చక్రపాణి, సిరిగిరెడ్డి నర్సిరెడ్డి, ధనుంజయ, అప్పం గోయల్, సాయిని శేఖర్, దాసిరెడ్డి శ్రవణ్ కుమార్ రెడ్డి, పున్న వెంకటేశం, తదితరులున్నారు.

తలలో నాలుకలా..

రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామంలో అకస్మికంగా మృతిచెందిన ఫొటోగ్రాఫర్ మిర్యాల రామకృష్ణ (38) గ్రామంలోని ప్రజలందరిలో తలలో నాలుకలా వ్యవహరించేవారని, అందరితో మంచిగా మాట్లాడుతూ మృదుస్వభావిగా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయనకు స్నేహితులు కూడా ఎక్కువే. అలాంటి రామకృష్ణ ఆకస్మికంగా మృతి చెందడంతో ఒక్కసారిగా గ్రామం ఉలిక్కిపడింది.

సోషల్ మీడియా అద్భుతం...

ఏ వ్యవహారంలోనైనా అతి అనర్థం... మితం మేలు అంటారు.సోషల్ మీడియాను మనం ఎట్లా వాడుకుంటే అట్లా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు.రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామంలో కుటుంబ పెద్ద ఆకస్మికంగా మృతి చెందడంతో చిన్నపిల్లలు ఉన్న ఆ కుటుంబం ఒక్కసారిగా రోడ్డు మీద పడింది. కన్నీరు పెట్టని కుటుంబం.. వేదన పడని వ్యక్తి లేరని చెప్పొచ్చు. రామకృష్ణ మృతి చెందడం ఆ కుటుంబం రోడ్డున పడ్డ విషయాన్ని గమనించిన స్నేహితులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు అందరూ కలిసి ఒక ఆలోచన చేసి సోషల్ మీడియాలో రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని ఒక ప్రకటన చేయడంతో చేసిన ఐదు రోజుల్లోనే నాలుగు లక్షల రూపాయలు, దశదిన కర్మ రోజు వరకు 10,74,150 రూపాయలు మానవతావాదులు అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.100 రూపాయలు నుండి మొదలుకొని 25వేల రూపాయల వరకు ఎవరికి తోచిన విధంగా వారు ఆర్థిక సాయం అందజేశారు.

పట్టు తప్పితే ప్రమాదమే.!



- పరిమితికి మించి ప్రయాణం
- నిబంధనలు పాటించని డ్రైవర్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ప్రమాదమని తెలిసినా ప్రయాణిస్తున్న ప్రజలు

నవతెలంగాణ-చండూరు

రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నా...పోలీసులు జరిమానాలు విధించినా కొందరు డ్రైవర్ల నిర్లక్ష్యం మితిమీరుతుంది. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని ఆటోలో పరిమితికి మించి తరలిస్తున్నారు. పట్టు జారితే ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదమున్నా డ్రైవర్లు అదేతీరుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలను పరిమితికి మించి ఎక్కించుకొని తరలిస్తున్నారు. కనీసం ఆటో హ్యాండిల్ తిప్పేందుకు కూడా వీలు లేకుండా కూలీలను ఎక్కించుకుంటున్నారు. శుక్రవారం చండూరు సంత కావడంతో పరిసర గ్రామాల నుంచి సకాలంలో బస్సులు లేకపోవడంతో ఇలా ఆటోలో వస్తూ కనిపించారు. గతంలో పరిమితికి మించి ప్రయాణం చేస్తున్న వాహనాలు బోల్తా పడి పలువురికి గాయాలు కాగా మరికొందరు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రమాదం మని తెలిసిన ప్రమాదకర ప్రయాణం చేయడం ఆందోళన కలిగిస్తుంది. పోలీసులు, రోడ్డు రవాణా శాఖ అధికారులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం

నవతెలంగాణ-నకిరేకల్



విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ నకిరేకల్ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ స్థానిక జూయ్ కళాశాల ముందు బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3శాతంఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ అని, గత బడ్జెట్లో విద్యారంగానికి 21 వేల 389 కోట్ల రూపాయలు కేటాయిస్తే ప్రస్తుతం 21,292కోట్లు కేటాయించారని, ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య ఏమాత్రం అభివృద్ధి కాదని అన్నారు. పాఠశాల విద్యారంగ లో ఖాళీల భర్తీ ,మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, మూత్రశాలలు, మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని పేర్కొన్నారు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవీన్, వినయ్, గోపి, మహేష్ , స్వప్న, శృతి, రేణుక, మనీషా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నుండి గంజాయిని తరిమి కొడదాం



నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ఇటీవల యువత అత్యంత వేగంగా గంజాయి మత్తుకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సూర్యాపేట జిల్లా నుండి గంజాయిని తరిమి కొట్టాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మా ర్జున్ పిలుపునిచ్చారు.శనివారం తన జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన విద్యార్థి యువజన సమితి కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వివిధ కారణాల రీత్యా విద్యార్థులు యువకులు, దురు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని వారికి గంజాయి వల్ల జరిగే ప్రమాదాన్ని వివరించి చెబుతూ చైతనవంతులు చేయాల్సిన బాధ్యత విద్యార్థి యువజన సంఘాలదేనని అన్నారు.జయశంకర్ జయంతిని పురస్కరించు కొని ఆగస్టు 6వతేదీ నుండి గంజాయికి వ్యతిరేఖంగా సెమీనార్‌లు, సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, పలువురు న్యాయవాదులు, డాక్టర్ లు,ప్రజాసంఘాల నాయకులు ధర్మార్జున్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు తండు నాగరాజు,లీగల్ సెల్ జిల్లా కోకన్వీనర్లు వీరేష్ నాయక్, భాష బోయిన వేణు విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ రాష్ట్రీయ విద్యార్థి సమితి రాష్ట్ర కన్వీనర్ సందీప్ గౌడ్, ఎస్టీ సెల్ నాయకులు సతీష్ , లక్క పక్క నవీన్ యాకూబ్ రెడ్డి ,సతీష్ ,చందు, మురళి ఇట్టా ట్టమల్ల శ్రీనివాస్ మంగు నాయక్ లోకేష్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా తవక్లాపురం రోడ్డు



డిండి: డిండి మండల కేంద్రం నుండి తవక్లాపురం గ్రామానికి వెళ్ళే రహదారిపై నగారదుబ్బతండ నుండి తవక్లాపురం గ్రామం వరకు సుమారు 3 కిలోమీటర్లు మట్టిరోడ్డు పై ఉన్న గుంతలను పూడ్చి మరమత్తుచేయాలని ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల నవీన్ శనివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. మండలకేంద్రానికి తవక్లాపురం గ్రామం నుండి ప్రతిరోజు వందల మంది వస్తుంటారన్నారు. రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.

ప్రజాపాలన ఆదరణ చూడలేక హరీశ్‌రావు విమర్శలు

- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



ప్రజాపాలన ఆదరణ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దుయ్యబట్టారు. అసెంబ్లీలో హరీశ్‌రావు బడ్జెట్‌పై ప్రజలను తప్పుదోవ పట్టించే సమయం లో తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతూ పదేండ్లు అధికారంలో ఉండి చేసిన వాగ్దానాలను మరిచిపోయి పరిపాలన చేసిన బీఆర్ఎస్ ప్రజాపాలనపై,మంత్రులపై హరీశ్‌రావు మాట్లాడడం సిగ్గు చేటుగా ఉందన్నారు.హరీశ్‌రావు మాట్లాడిన మాటలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దళితున్ని సీఎంను చేస్తానని చెప్పి చేయలేదన్నారు.డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు.రుణమాఫీ చేస్తామని చేయలేదన్నారు.మూడెకారల భూమి అని చెప్పి ఇవ్వలేదన్నారు.కానీ ఈ ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చూసి జీర్ణించుకోలేక తెలంగాణ రాష్ట్ర మహిళల,ప్రజల నుండి వస్తున్న ఆదరణను చూసి హరీశ్‌రావు ఓర్వలేక పోతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కళ్లల్లో కళ్ళు పెట్టి చూడలేని ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ పడుకున్నాడని ప్రశ్నించారు.గ్రామంలో రెవెన్యూ వ్యవస్థను గత ప్రభుత్వం ఆగం చేసిందన్నారు.వీఆర్‌ఓ, వీఆర్ఏ వ్యవస్థను పూర్తిగా ఆగం చేశారని మండిపడ్డారు.ధరణి పేరుతో అనేక సమస్యలను సృష్టిసంచారని ఆరోపించారు.చీల్చి చెండాడుతా అన్న మాజీ సీఎం ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.100సమస్యలతో ప్రజలు మా వద్దకు వస్తే అందులో సుమారు 90 సమస్యలు ధరణితో వచ్చిన సమస్యలేనన్నారు.ప్రజాపాలన వచ్చిన తర్వాత రెవెన్యూపరంగా ఉన్న సమస్యలను పరిష్కారం కోసం ఈ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.రెవెన్యూ వ్యవస్థను ఆగం చేసిన మీరు ఈరోజు బడ్జెట్ గురించి మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు.

ట్రినిటీలో బోనాల పండుగ



నవతెలంగాణ-చౌటుప్పల్

ప్రకృతి సమతుల్యతకు ప్రతీక అయిన ఆషాఢబోనాలను పురస్కరించుకొని శనివారం చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని ట్రినిటీ విద్యాసంస్థల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.విద్యార్థినులు బోనాలు ఎత్తుకొని ఆటపాటలు ఆడిపాడారు.శివసత్తుల విన్యాసాలతో ప్రదర్శన పలువుర్ని అలరించాయి.అనంతరం డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ఇలాంటి తెలంగాణ సంప్రదాయ పండుగలను నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఆషాఢమాసంలో వచ్చే సూక్ష్మజీవుల వల్ల కలిగే ఇబ్బందులను నివారించడానికి పసుపును శరీరానికి రాసుకోవడం వల్ల ఆంటీ బయోటెక్‌తో ఉపయోగపడే సూక్ష్మజీవుల నుండి నిర్మూలన కలుగుతుందన్నారు.వేపాకు వాడడం వల్ల క్రిమీకీటకాలు నశిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గాంధీగ్లోబల్ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మెన్ కేవీబీ.కృష్ణారావు, కౌన్సిలర్లు కాసర్ల మంజుల, బొడిగెఅరుణ, విజయలక్ష్మీ, పోలోజు శ్రీధర్‌బాబు, సీతారామచంద్రస్వామి దేవాలయ అధ్యక్షులు బొబ్బిళ్ల మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిపోతున్న నిందితుడిని పట్టుకున్న పోలీసులు



కొండమల్లేపల్లి: సెంట్రింగ్ సామాను దొంగిలించి ట్రాలీ ఆటో లోడుతో పారిపోతున్న ఓ నిందితుడిని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రామ్మూర్తి వెల్లడించారు. శనివారం స్థానికంగా ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి కాలనీ సైదాబాద్ చెందిన వడ్తే. చిన్న సన్నాఫ్ రాములు సెంట్రింగ్ సామాన్లు దొంగలించి ట్రాలీ ఆటోలో వేసుకుని వెళ్తున్నాడు. శనివారం మధ్యాహ్నం సీఐ ధనుంజయ్‌గౌడ్, ఎస్సై రామ్మూర్తి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ రహదారిపై ఒంటి గంట సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో సెంట్రింగ్ లోడుతో ఆటో అతివేగంగా వస్తుండడంతో గమనించి పోలీసులు ఆటోను అదుపులోకి తీసుకున్నందుకు ప్రయత్నించారు. నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకొని స్టేషన్‌కు తీసుకువచ్చి సాంకేతిక పరిజ్ఞానంతో వేలిముద్రలను పరీక్షించి విచారించారు. నిందితుడు గతంలో కూడా చోరీలకు అలవాటు పడిన నేరస్తుడిగా రుజువు కావడంతో వెంటనే నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న దేవరకొండ డీఎస్పీ,సీఐ ధనుంజయ్ గౌడ్‌ను, ఎస్ఐ రామ్మూర్తిలను, హెడ్‌కానిస్టేబుల్ జగన్, కానిస్టేబుల్ రాము, భాస్కర్, హేమ నాయక్ హోంగార్డు మల్లికార్జునలను డిఎస్పీ అభినందించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-నాంపల్లి



మాదకద్రవ్యాలకు, మత్తుపదార్థాలకు విద్యార్థులు, యువకులు దూరంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ లచ్చిరెడ్డి సూచించారు. శనివారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాంపల్లి కమిటీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు, యువకులకు మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం డ్రగ్స్ నిర్మూలన కోసం అహర్నిశలు కష్టపడడం జరుగుతుందన్నారు. విద్యార్థులు యువకులు డ్రగ్స్, గంజాయి కి మాదకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చెడు అలవాట్లకు పోకుండా ఉండాలని బాగా చదువుకొని తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు మల్లం మహేష్, ఖమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, రచయిత భాస్కర్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు నాంపల్లి చంద్రమౌళి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వర్గాలకు వరాలు పేదలకు బారాలు



- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నవతెలంగాణ -మునుగోడు

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు రాయితీలు ఇస్తూ పేదలు విద్య వైద్యము ఎరువుల సబ్సిడీలు కోతలు విధిస్తూ పేదల సంక్షేమానికి కోతలు విధిస్తున్న ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు శనివారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ మండల కార్యదర్శులు ప్రజా సంఘాల సమావేశంలో నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వికసిత్ భారత్ అనే నినాదం ఒక వైపు ఇస్తూ మరొకవైపు విద్య ఆరోగ్యము సాంఘిక సంక్షేమం ఎరువుల సబ్సిడీ ఉపాధి హామీని బడ్జెట్లో కోతలు విధిస్తూ దేశంలో ఆర్థిక అసమానతలు పెంచి పోషించే విధంగాబీజేపీ పాలన సాగిస్తుందన్నారు. రాష్ట్రానికి విభజన చట్టం లోని ఏ ఒక్క అంశాన్ని గాని పరిష్కారం చేయడంలేదన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టు లకు గాని రంగారెడ్డి పాలమూరు ప్రాజెక్టుకు గాని ఎలాంటి నిధులు ఇవ్వకుండా పక్షపాత వైఖరి అవలంబిస్తున్నదన్నారు. ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు బి గాలయ్య మాజీ ఎంపిటిసి అధ్యక్షత వహించారు ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ రామలింగయ్య జి రామచంద్రన్ టి వెంకటేశ్వర్లు మండల కార్యదర్శులు చాపల శీను , నలపరాజు సతీష్ , భిక్షం రెడ్డి , రమేష్ , బూడిద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బయోటెక్నాలజీ రంగంలో అపారమైన వ్యాపార అవకాశాలు

- గ్రాడ్యుయేషన్ దినోత్సవంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

బయోటెక్నాలజీ రంగంలో జీవజాలానికి సేవలతో పాటు అపారమైన వ్యాపార అవకాశాలు ఉన్నాయని విద్యార్థుల గ్రాడ్యుయేషన్ దినోత్సవంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి పేర్కొన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసుకున్న విద్యార్థు లకు గ్రాడ్యుయేషన్ ఉత్సవాన్ని బయోటెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవజాలానికి సేవతో పాటు బయోటెక్నాలజీ రంగంలో మంచి వ్యాపార అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ప్రపంచానికి వ్యాక్సిన్ రాజధానిగా హైదరాబాద్ ఎదిగిన క్రమాన్ని విద్యార్థులకు వివరించారు. మానవాళి ఎదుర్కొం టున్న అనేక సవాళ్లను సూక్ష్మంగా పరిశీలించి ఔషధాలు చికిత్స విధానాలకు బయోటెక్నాలజీ రంగం విశిష్ట సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ డా ప్రశాంతి మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగంలో విశిష్టమైన పరిశోధనలు చేస్తూ మేలైన ఫలితాలను అందించిన సంస్థలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు తమ ఎంఎస్సీలో భాగంగా అధ్యాపకుల పర్యవేక్షణలో చేసిన ప్రాజెక్టులకు అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా ప్రేమ్ సాగర్ , డా మాధురి, డా శివరాం, అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ ఇన్‌స్పెక్టర్‌గా శోభన్‌బాబు



నాంపల్లి: నాంపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా శోభన్ బాబు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన దేవరకొండ నుండి నాంపల్లి మండలానికి బదిలీపై రావడం జరిగింది. నాంపల్లి పోలీస్ స్టేషన్ లో పని చేసిన సబ్ ఇన్స్పెక్టర్ లచ్చిరెడ్డి ఎస్పీ ఆఫీసుకు బదిలీపై వెళ్లడం జరిగింది.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
ఆదివారం | జులై 28, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యే వేములవీరేశంకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మండల పరిధిలోని చిన్నతుమ్మలగూడెం నుంచి చిప్పలపల్లి వరకు బీటీ రోడ్డు లేక అవస్థలు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేస్తున్న బిటి రోడ్డు పనులను నాణ్యతగా, వేగవంతం చేసిన నకరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం కు తుమ్మలగూడెం, చిప్పలపల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం చిన్న తుమ్మలగూడెం మాజీ సర్పంచ్ దాసరి రాజుయాదవ్ చిప్పలపల్లి మాజీ సర్పంచ్ కలమ్మ జీడికల్ ఉపసర్పంచ్లు అరుణ లచ్చిరెడ్డి, రాంబాబులు పనులు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దశరథ, కృష్ణార్జునరెడ్డి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్-2 ఎస్సైగా జి.మానస

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్



నల్లగొండ టూటౌన్-2 ఎస్సైగా జి.మానస శనివారం బాధ్యతలు చేపట్టారు.ఈమె 2018లో ఎస్సైగా సెలక్టయ్యారు. ప్రస్తుతం పోలీస్ జిల్లాకేంద్ర కార్యాలయంలో త్రిబులేసీఎస్‌లో ఎస్సైగా పనిచేస్తున్నారు.ఈ క్రమంలో ఆమె నల్లగొండటూటౌన్ -2 ఎస్సైగా బదిలీ చేస్తూ ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై జి.మానస మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణ ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే మధ్యవర్తులను ఆశ్రయి ంచకుండా నేరుగా తనను ఆశ్రయిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఎస్‌హెచ్ఓ నాగరాజు ఆధ్వర్యంలో పని చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉన్నతాధికారుల సహకారంతో పని చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- గుంపుల తిరుమలగిరిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-చివ్వెంల



ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు.మండలంలోని గుంపుల తిరుమలగిరిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను శనివారం ఆకస్మికంగా కలెక్టర్ సందర్శించారు. గుంపుల తిరుమలగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రధాన ఉపాధ్యాయురాలు కార్యాలయంలో హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు అయిన ముగ్గురు ఉపాధ్యాయుల గురించి కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిని ఆరాతీశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పుస్తకాల పంపిణీ, ఏకరూప దుస్తుల పంపిణీ వివరాలను ప్రధాన ఉపాధ్యాయురాలు శైలజని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి బి సెక్షన్ గదిని కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో తెలుగు పుస్తకాన్ని చదివిపించారు. వంట గదిని పరిశీలించి మెనూ ప్రకారం కూరగాయలను పరిశీలించారు. ఆవరణలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. నాలుగో తరగతి గదిలో శ్రీదేవి టీచర్ భోదిస్తున్న ఇంగ్లీష్ సబ్జెక్ట్ పై పలు ప్రశ్నలను విద్యార్థులనని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న ఏకలవ్య నాటకం

విద్యార్థులు ఆంగ్లంలో ఏకలవ్య డ్రామాను కలెక్టర్ కి చేసి చూపించారు. అదే డ్రామాను తెలుగులో చేయాలని కలెక్టర్ కోరగా విద్యార్థులు తెలుగులో కూడా ఎక్కలవ్య డ్రామాను వేసి చూపించారు. పాఠశాల నిర్వహణపై ప్రధాన ఉపాధ్యాయురాలు శైలజను కలెక్టర్ అభినందించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న చిన్న పిల్లలతో కలెక్టర్ ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు శైలజ ఉపాధ్యాయులు వెంకన్న, లలిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే న్యాయం అందేలా కోర్టుల అభివృద్ధి

- గుట్ట కోర్టు ప్రారంభంలో జడ్జి ఈవీ.వేణుగోపాల్

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



సకాలంలో కేసుల పరిష్కారంతో పాటు అట్టడుగు స్థాయి వారికి కూడా సత్వరమే న్యాయం అందేలా కోర్టుల అభివృద్ధి చేయడం జరుగుతు న్నట్లు రాష్ట్ర హైకోర్టు జడ్జి, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఈవీ.వేణుగోపాల్ అన్నారు. శనివారం యాదగిరిగుట్టలో నూతన జూనియర్ సివిల్‌జడ్జి, మొదటి శ్రేణి జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.సత్వర న్యాయంతో పాటు కేసులు వేగంగా పరిష్కరించడం కోసం న్యాయస్థానాలను కొత్తగా ఏర్పాటు చేస్తూ తదనుగుణంగా అభివృద్ధి చేయడం జరుగుతున్నద న్నారు.అందులో భాగంగా యాదగిరిగుట్టలో నూతన కోర్టు ప్రారంభించుకుంటున్నామని తెలిపారు.కోర్టు శాశ్వత భవనం కోసం స్థలం ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు.విద్య ద్వారా మాత్రమే సమాజంలో మార్పు వస్తుందని, వేగంగా మారుతున్న కాలంలో సోదరభావంతో మెలగడం ముఖ్యమన్నారు.అందరి సమన్వయంతో కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.జస్టిస్ టి.వినోద్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్ కేసులను తగ్గించడానికి అందరి సహకారం ముఖ్యమని, సివిల్, క్రిమినల్ దీర్ఘకాలిక కేసులు త్వరగా పరిష్కరించేలా చూడాలన్నారు. జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట, రాజపేట మండలాలకు సంబంధించిన కేసుల పరిష్కారానికిగాను యాదగిరిగుట్టలో నూతనంగా కోర్టు ప్రారంభించుకుంటున్నామని, యాదగిరిగుట్ట కోర్టు పరిధికి చెందిన 1989 కేసుల బదిలీ జరిగిందన్నారు. ఇందులో 1154 సివిల్, 835 క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. కేసుల పరిష్కారానికిగాను ఈ కోర్టుకు త్వరగా ఒక న్యాయమూర్తి నియామక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. కేసులను సకాలంలో పరిష్కరించే బాధ్యత మనపై ఉందని, పెండింగ్ కేసులు తగ్గించేలా అందరూ సహకరించాలని తెలిపారు. పేదవారికి న్యాయం అందుబాటులో ఉండేలా, వారికి న్యాయవ్యవస్థ మీద నమ్మకం పెరిగేలా చేయడం, గ్రామీణ ప్రాంతాలలోని వారికి న్యాయం అందేలా చూడడం అందరి బాధ్యత అన్నారు. జస్టిస్ కె.సుజన మాట్లాడుతూ కేసుల పరిష్కారం ఇంకా సులభతరం చేయడం కోసం ప్రాచుర్యం కలిగిన యాదగిరిగుట్టలో కోర్టు ప్రారంభం కావడం సంతోషించదగిన విషయమన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు మాట్లాడుతూ కోర్టు ఏర్పాటులో గౌరవ ఉన్నత న్యాయస్థానం త్వరితగతిన చర్యలు తీసుకొని తగిన సూచనలు ఇచ్చిన దానిపై నూతన కోర్టు ఏర్పాటు చేయటం జరిగిందని, కేసుల భారం ఆలేరు కోర్టుపై తగ్గి కేసుల సత్వర పరిష్కారానికి దోహదపడుతుందని తెలిపారు. యాదాద్రి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడ్ల స్వామి మాట్లాడుతూ.. యాదాద్రిలో మేజిస్ట్రేటు కోర్టు ఏర్పాటు కోసం కృషి చేసినట్లు, దీనికై ఉన్నత న్యాయస్థానం తక్షణ చర్యలు తీసుకున్నట్లు, ఈ కార్యక్రమములో న్యాయవాదుల అందరి కృషి ఉన్నదని తెలిపారు.అనంతరం న్యాయమూర్తులను వివిధ బార్ అసోసియేషన్స్ ప్రతినిధులు సన్మానించారు.కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత, ప్రధానజూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, కలెక్టర్ హనుమంత్ కే.జండగే, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి జి.కవిత, రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి, నూతన యాదాద్రి కోర్టు ఇంచార్జి జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.సుమలత, చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి మహతి, డిప్యూటీ పోలీసు కమిషనర్ రాజేశ్ చంద్ర, యాదాద్రి న్యాయవాదుల సంఘం కార్యదర్శి శ్రీహరి, న్యాయవాదులు, రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు యం.ఎ.మజీద్, భువనగిరి అధ్యక్షులు బి.హరినాథ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా... ప్రయాణం సాగేదెలా..



నవతెలంగాణ- చండూరు

గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా గుంతల మయంగా మారి, చినుకు పడితే చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని వివిధ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .అధికారుల నిర్లక్ష్యం,పాలకుల అలసత్వంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. విద్యార్థులతో పాటు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడి గుంతల్లో నీరు నిలుస్తుండటంతో గుంతలు గమనించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటు న్నారు. రోడ్లపై ప్రయాణించాలంటే నరకం కనబడుతుందని గ్రామస్తులు ఆందోళనపడుతు న్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నరకయాతనగా రోడ్లు...

మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు చొప్పరివారి గూడెం, పడమటి తాళ్ల, జోగిగూడెం, తిమ్మారెడ్డి గూడెం గ్రామపంచాయతీల రోడ్లు వర్షం పడిందంటే పట్ట పగలే ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. కంకర తేలిన రోడ్డు పై ప్రయాణం చొప్పరివారి గూడెం ప్రజలకు నరకయతనగా మారిందని ప్రజలు వాపోతున్నారు. బంగారిగడ్డ, ధోనిపాముల గ్రామాలల్లో ప్రజల పరిస్థితి విచిత్రంగా ఉంది. టిప్పర్ల వల్ల తారు రోడ్డు పూర్తిగా గుంతలు కావటంతో మట్టి పోశారు. వర్షాలకు రోడ్డు మొత్తం బురద గా మారి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. వర్షం పోయిందంటే దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు హడావిడిగా శంకుస్థాపన చేసినప్పటికీ ఎన్నికల్లో అపార్టీ ఓటమిపాలు కావటంతో పనులు శంకుస్థాపనకే పరిమితం అయ్యాయి.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల నిర్మాణానికి పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టిప్పర్ లోడ్‌లతో రోడ్లన్నీ అధ్వానం..



పల్లె నర్సింహ, బంగారుగడ్డ

మట్టి టిప్పర్ లోడ్లతో రోడ్లని అద్వానంగా తయార య్యాయి. పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి వర్షం వచ్చేటప్పుడు అందులో మురుగు నీరు చేరి సుగంధం వెదజల్లు తుంది. వాన దారులు గుంతలో పడి గాయాలైన సంఘ టనలు ఉన్నాయి. రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలి. పల్లెలకు రోడ్లు ఏర్పాటు చేయాలి.

కొండమల్లేపల్లి పోలీసులను అభినందించిన ఎస్పీ



కొండమల్లేపల్లి :ఉరి వేసుకుని అపమారక స్థితిలో ఉన్న ఓ మహిళను సమయానికి పోలీసులు తమ పోలీస్ వాహనంలో హస్పిటల్ కి తీసుకువెళ్లి చికిత్స అందించి మహిళా ప్రాణాలను కాపాడిన కొండమల్లేపల్లి పోలీసులను శనివారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తన కార్యాలయంలో కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ గౌడ్ను, ఎస్ఐ రామ్మూర్తిని, కానిస్టేబుల్ మజీద్, రాము ,ప్రవీణ్, మల్లికార్జునలను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధ్యతగా పోలీసులు సమయానికి అపమారక స్థితిలో ఉన్నటువంటి ఆంబోతు నందు అనే మహిళను హస్పటల్కి తీసుకెళ్లి చికిత్స అందించి మహిళా ప్రాణాలను కాపాడడం అభినందనీయమని ప్రజలు ఎవరు కూడా చిన్నచిన్న గొడవలకు క్షణికావేశంకి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడవద్దని తమ పిల్లల భవిష్యత్తును ఒకసారి ఆలోచించుకొని జీవించాలని కుటుంబంలో చిన్నచిన్న గొడవలు జరగడం సహజమని ఇలాంటి గొడవలకు తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

నవతెలంగాణ- నేరేడుచర్ల

మండలంలోని పెంచికల్ దిన్న జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ శిక్షకుడు మామిడి సత్యనారాయణ వ్యక్తిత్వ వికాసం పై శిక్షణ ఇచ్చారు, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనడానికి అవసరమయ్యే నైపుణ్యాలను అందరూ అలవరచుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు,మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చిన్నతనం నుండే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని అ లక్ష్య సాధనకు అవసరం అయ్యే విధంగా బాగా చదువుకొని సాధించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి శేఖర్ సేవలు అభినందనీయం



- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయపరిచి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా వేరే గ్రామానికి వెళ్ళుచున్న గ్రామపంచాయతీ కార్యదర్శి శేఖర్ సేవలు అభినందనీయమని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ అన్నారు.శనివారం భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ఐదేండ్లకుపైగా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసే సాధారణ బదిలీపై వెళ్తున్న శేఖర్‌ను సీపీఐ(ఎం) శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి శేఖర్ రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధికి తనవంతు పాత్ర పోషించాడన్నారు.గ్రామంలో ఉన్న మంచినీళ్ళ,డ్రయినేజీ, వీధిలైట్లు, సీసీరోడ్లు అన్ని వార్డులలో వేయడానికి అందించడానికి మంచికృషి చేశారని తెలిపారు.గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరచడానికి ప్రయత్నించాడని, గ్రామాన్ని సుందరీకరణ చేయడంలో, పచ్చదనం పరిశుభ్రతగా ఉంచడానికి మంచి ప్రయత్నం చేశాడన్నారు.రాజకీయాలకు తావివ్వకుండా ఉద్యోగ విధి నిర్వహణలో ప్రజలందరికీ మంచి పరిపాలన అందించాడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు కొండా అశోక్, గ్రామ శాఖ కార్యదర్శి కూకుట్లకృష్ణ, జక్కుల మల్లేష్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాల్సిందే

- ప్రభుత్వాలు మారిన ఉపకార వేతనాలు తీరవా
- ఫీజు గోడు తీరేదెన్నడు?
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు



నవతెలంగాణ-బొమ్మలరామారం

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు మాట్లాడుతూ కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్య సంక్షోభంలో ఉన్నదన్నారు.పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పేద విద్యార్థుల చదువులకు ఒరిగిందేమీ లేదన్నారు.ఇప్పటివరకు స్కాలర్‌షిప్‌లు,ఫీజురీయాంబర్స్‌మెంట్ రూ.8200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలో వచ్చి ఆరు నెలలు నడుస్తున్న ఊసు ఎత్తలేదున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రాగానే విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామన్నారు, కానీ 7.3 శాతం నిధులే కేటాయించారని విమర్శించారు.తక్షణమే దాన్ని సవరించి, విద్యారంగానికి 30శాతంనిధులు కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలకార్యదర్శి ధరావత్ జగన్‌నాయక్, మండలనాయకులు, వెంకటేష్, భరత్, శ్రీకాంత్ వేణు,చరణ్ అవినాష్, శివ, సందీప్,శ్రీధర్,సునీల్,మున్న తదితరులు పాల్గొన్నారు.

కేసారం పల్లె దవాఖానను పరిశీలించిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్



సూర్యాపేట మండల పరిధిలోని ఏసారం అయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అంటువ్యాధులు శోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పాత కూలర్లు, టైర్లు, ఖాళీ సీసాలలో దోమలు చేరుతాయి కాబట్టి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి,డాక్టర్ సుష్మ,అంజయ్య, ఏఎన్ఎం ఉపేంద్ర, ఆశ ,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రాల అప్‌గ్రేడేషన్ పనులు చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

అంగన్వాడీ కేంద్రాల అప్‌గ్రేడేషన్ పనులు చేపట్టాలని కలెక్టర్ హనుమంత్ కే.జెండగే అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, పంచాయితీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటేశ్వర్లు, మిషన్‌భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కరుణాకర్‌లతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల అప్ గ్రేడెషన్ కోసం 200 అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్స్ నిర్మాణం కోసం, 50 అంగన్వాడీ కేంద్రాలలో తాగునీరు పనులకు, 7 కేంద్రాలలో మరమ్మతుల కొరకు మొత్తం 98 లక్షలా 13 వేల రూపాయలు విడుదలయయ్యాని తెలిపారు. ఎస్టిమేషన్ పనులు త్వరగా పూర్తి చేసి పనులు గ్రౌడింగ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు జ్యోత్స్న, చంద్రకళ, శైలజ, స్వరాజ్యం, రమ, సమీర పాల్గొన్నారు.



పేద గిరిజన విద్యార్థి కల సాకారం

- ఐఐటీలో సీటు సాధించిన భూక్యా ఆనంద్‌సాయి

కోదాడరూరల్:పట్టణపరిధిలోని కొమరబండ గ్రామంలోని తేజవిద్యాలయ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదివిన మిర్యాతండాకు చెందిన పేద గిరిజన బిడ్డ భూక్యా ఆనంద్‌సాయి ఐఐటీలో సీటు సాధించి తన కల సాకారం చేసుకున్నాడని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జటావత్‌రవీందర్ పేర్కొన్నారు.శనివారం పట్టణంలోని తేజ విద్యాలయలో ఐఐటి సాధించిన ఆనంద్‌సాయికి సన్మాన కార్యక్రమం నిర్వహించి వారు మాట్లాడారు. ఐఐటీ, కేఈఈ - 2024 లో భారతదేశ స్థాయిలో 753వ ర్యాంకు సాధించిన ఆనంద్‌సాయి మిర్యాతాండకు చెందిన వారు.ఇతని నాన్న భూక్యా భిక్షం పట్టణంలోని మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు.తల్లి కళావతి రైతు కూలీ.ఇద్దరు నిరక్షరాస్యులే అయినా కుమారున్ని మంచిస్థాయిలో చూడాలని పాఠశాల విద్యను 'తేజ విద్యాలయ' కొమరబండలో చేయించారు.మిర్యాతండా నుంచి ఐఐటీ సాధించిన మొదటి విద్యార్థి ఆనంద్‌సాయి కావడం గర్వకారణంగా ఉందని తల్లి కళావతి చెప్పారు.జాతీయ స్థాయిలో ఐఐటీలో మంచి ర్యాంకు సాధించి బెనారస్ ఐఐటీలో చేరబోతున్న ఆనంద్‌సాయిని రిటైర్డ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ పోతుగంటి నాగేశ్వరరావు, స్వర్ణభారతి ట్రస్ట్ సభ్యులు చెన్నకేశవరావు, సుధాకర్, సభ్యులు ఆనంద్‌సాయిని సన్మానించారు. కష్టపడి చదివితే ఎంతో గొప్పపేరున్న కళాశాలలో సీటు సాధించవచ్చని ఆనంద్‌సాయి లాంటి పిల్లలు నిరూపించారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని తేజసంస్థల వ్యవస్థాపక సభ్యుడు శ్రీరామ్, జానకిరాములు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ సోమిరెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ జిల్లాకార్యదర్శి కాదూరి అచ్చయ్య, ఆలేరు మండలఅధ్యక్షుడు పూజారి కుమారస్వామిగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో శనివారం మండల విస్తృత స్థాయి సమావేశం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని, వరికి రూ.500 బోనస్, ఫసల్‌బీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ. 2500 అందించాలని కోరారు. బీసీ కుల గణన చేసి రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి శ్రీనివాస్,జిల్లా కార్యవర్గ సభ్యులు భోగ శ్రీనివాస్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, మండల మహిళా మోర్చా అధ్యక్షులు అర్చన, మండల ఉపాధ్యక్షులు మాసాపేట రాజు, రవి, నాయకులు శ్రీకాంత్, అమర్,అంకం శ్రీను, రాజు, ములుగు రాజు, సందీప్, శ్రీకాంత్, మధు, వడ్డేపల్లి కిషన్, సతీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

నవతెలంగాణ-ఆత్మకూరు ఎం

జిల్లాలోఅనేక సాగునీటి సమస్యల, జిల్లా అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా జిల్లాను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు.శనివారం మండల కేంద్రంలోని జెఎఎస్ ఫంక్షన్‌హాల్‌లో మారెపాక వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.జిల్లాలో సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న బునాదిగాని కాల్వ, పిలాయి పల్లి కాలువ, బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్లు, మూసి ప్రక్షాళనకు ఒక రూపాయి కూడా రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, చేనేత సంఘం రాష్ట్ర నాయకులు పాశికంటి లక్ష్మీనరసయ్య, కుసుమాని హరిచంద్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి జల్ది రాములు మండల నాయకులు జక్క దయాకర్‌రెడ్డి, గుర్రంరాజమణి, సోలిపురంలింగారెడ్డి, సుల్తాన్,పురుషోత్తం, యాసబుచ్చిరెడ్డి, కసరబోయిన సత్తయ్య, కల్వల నర్సయ్య మారుపాక అంజయ్య ఎండి నయీం పాల్గొన్నారు.

హోంగార్డ్ మృతి

నవతెలంగాణ-మఠంపల్లి



మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా చందనజాని విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం. హుజూర్‌నగర్ మండలం లింగగిరి చందన జానీ మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ డెంగీ జ్వరంతో బాధపడుతున్నాడు.ఈ క్రమంలో హైదరాబాదులోని ఓప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.పరిస్థితి విషమించి మృతి చెందాడు.

మొక్కలే మానవ జీవకోటికి ప్రాణాధారం

నవతెలంగాణ-నాగారం

మొక్కలే మానవ జీవకోటికి ప్రాణధారమని ఎంపీడీవో దారా శ్రీనివాస్ అన్నారు.శనివారం నాగారం మండలకేంద్రంలో ఉన్న ప్రాథమికఆరోగ్యకేంద్రంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బొమ్మగాని హర్ష, వినోద, స్టాఫ్‌నర్స్ కవిత, సరళ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

మండలంలోని కేంద్రంలోని మోడల్ స్కూల్ దగ్గర విద్యా, నిరుద్యోగ అంశాలనుగాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు నల్లగొండ నాగయ్య మాట్లాడుతూ....రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై నూతనంగా నిరుద్యోగులు, విద్యార్థులు గంపెడంతా ఆశలు పెట్టుకున్నారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బడ్జెట్‌ను చూస్తే ఉసురుమనేలా ఉందన్నారు. బడ్జెట్ లో నూతన విద్యాసంస్థల ప్రస్తావన లేదు. ఎన్నికల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి బడ్జెట్‌ను కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమం పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు, జలగం సుమంత్ విడమర్తి భరత్,పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధానకార్యదర్శి కంచర్ల నరసమ్మ కాలేజ్ విద్యార్థులు, సంధ్య, మానస, ప్రవళిక, శైలజ, ప్రియాంక, మహేష్, నవీన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

'మాదిగ ఉపకులాల వర్గీకరణ చేపట్టాలి'

నవతెలంగాణ-హుజూర్‌నగర్

మాదిగ ఉపకులాల వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వడిదల రవి కోరారు.పట్టణంలోని టౌన్‌హాలులో శనివారం ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.మాదిగ ఉపకులాలను ఏబీసీడీలుగా విభజించారని ఆగస్టు నెల 9వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాలు మాదిగలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.30 ఏండ్లుగా ఎమ్మార్పీఎస్ పోరాటం నిర్వహిస్తుందని, ఈ పోరాటాలలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు.కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ హామీ ఇచ్చినప్పటికీ అమలు కాలేదన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి మరికంటి అంబేద్కర్,ఉపాధ్యక్షుడు రావూరిభాస్కర్, జానయ్య, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మేళ్లచెర్వు మొగ్గంటి పెద్దకోటయ్య, మిద్దె వెంకటేశ్వర్లు, కస్తాల రవీందర్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సు కోసం పని చేసిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేసిన , సీపీఐ(ఎం) నాయకులు సుదగాని ఎట్టయ్య, ఏలుగల బాలయ్య, వడ్డేమాన్ శ్రీనివాసులు సేవలు ప్రశంసనీయమని ఆపార్టీ ఆలేరు పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆలేరు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు సూదగాని ఎట్టయ్య,సీపీఐ(ఎం) నాయకులు ఎలుగల బాలయ్య ,వడ్డేమాన్ శ్రీనివాసులు వర్ధంతిసభ సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా చిత్రపటాలకు పూలమాలలేసి జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎం ఏ ఇక్బాల్ మాట్లాడుతూ ఆలేరు ప్రాంత ప్రజా పోరాటాలలో ఎట్టయ్య, బాలయ్య, శ్రీనివాసుల పాత్ర చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు.ఎర్రజెండా పట్టిన నాయకులు ప్రజా ఉద్యమాలను పేద ప్రజల శ్రేయస్సును మర్చిపోకుండా, మేలు కోరి పోరాటాలలో ముందు నుండి పనిచేశారని తెలిపారు.సుధగాని ఎట్టయ్య ప్రత్యక్ష ఎన్నికల్లో మొట్టమొదటి ప్రజా పరిషత్ అధ్యక్షులుగా, ఎన్నికై మండల ప్రజలకు ఎంతో సేవ చేశారని చెప్పారు. మండల అభివృద్ధిలో కీలకంగా చేసిన సేవలు ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటారన్నారు.ఎలుగల బాలయ్య, వడ్డేమాన్ శ్రీనివాసులు, ప్రజాపాతినిధ్య పదవి లేనప్పటికీ, నిరంతరం పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేశారన్నారు.అమరుల స్ఫూర్తితో బలమైన ప్రజాఉద్యమాలను నిర్మించడమే వారికి నిజమైన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు మోరిగాడి రమేష్,ఘనగాని మల్లేష్ ,తాళ్లపల్లి గణేష్, వడ్డెమాను బాలరాజు,మోరిగాడి లక్ష్మణ్ ,ఘనగాని రాజు, మొరిగాడి అజయ్, డీవైఎఫ్ఐ నాయకులు వడ్డేమాన్ విప్లవ్ ,భువనగిరి గణేష్, గజ్జెల నర్సింహులు, కటకం సుదర్శన్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులలో దాగున్న ప్రతిభను వెలికి తీయడానికే బాలసభ

నవతెలంగాణ-తిరుమలగిరి

విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి బాలసభ నిర్వహిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను వెలికి తీయడానికి ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి నాలుగవ శనివారం బాలసభ నిర్వహిస్తున్నదన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు దామెర శ్రీనివాస్, ఉపాధ్యాయులు సోమయ్య, యాదయ్య, శ్రీనివాసచారి, విజయలక్ష్మి సత్తిరెడ్డి, దుర్గాప్రసాద్, ఆసిఫ్, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ క్యాన్ల పంపిణీ

నవతెలంగాణ-చిట్యాలటౌన్

మున్సిపల్ కౌన్సిలర్ శేపూరి రవీందర్ జన్మదిన సందర్భంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయుబ్ నగర్, శివనేనిగూడెం ,వెంకటాపురంలో ప్రతి ఇంటికి 20 లీటర్ల వాటర్ క్యాన్ లను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, బిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, కోనేటి ఎల్లయ్య ,ఆగు అశోక్, మందడి జనార్దన్ రెడ్డి, ఖమ్మం పార్టీ నరసింహ, రావుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముస్లింమైనారిటీలకు అధిక నిధులు కేటాయించడం పట్ల హర్షం

నవతెలంగాణ-డిండి

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరము సంబందించి ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టీ విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ముస్లింమైనారిటీలకు 3003 కోట్ల రూపాయలు కేటాయించటంపై డిండిమండల ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్‌ఖాదర్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వక్తంచేశారు. ముస్లింమైనారిటీల అభివృద్ధి కోరే కాంగ్రెస్‌పార్టీకి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిండి మైనారిటీ సంఘం అధ్యక్షులు శేఖ్ ఉమర్, మహ్మద్ ఖయ్యూం, బాబా, అవేజ్, ఫసీన్, యాసీన్ తదితరలు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.18వేలివ్వాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఏకలక్ష్మీ

నవతెలంగాణ-కోదాడరూరల్



మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.18వేలివ్వాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి చెరుకు ఏకలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో తిరుపతమ్మ అధ్యక్షతన జరిగిన మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 9 ,10 తరగతులకు సంబంధించిన వారికి ప నెలల నుంచి బిల్లులు కానీ వేతనాలు కానీ చెల్లించడం లేదన్నారు.20 ఏండ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం లేక అనారోగ్యానికి పాలవుతున్నారన్నారు.ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు.పెరుగుతున్న కూరగాయలు,నిత్యావసరాలకు అనుగుణంగా మెనూచార్జీలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలివ్వాలని కోరారు.సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 5వ తేదీ నుండి మధ్యాహ్న భోజనం చేయబోమని హెచ్చరించారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరివెంకట్‌నారాయణ, సీఐటీయూ టౌన్ కార్యదర్శి ఎం.ముత్యాలు, మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం టౌన్ అధ్యక్షురాలు గురజాల తిరుపతమ్మ,వెంకటరమణ,సుజాత,రామానుజమ్మ,రమణ, కుసుమ,బుజ్జి, సావిత్రమ్మ పాల్గొన్నారు.

కాసరబాద్ గౌడ సంఘం అభివృద్ధికి కృషి

నవతెలంగాణ -సూర్యాపేట రూరల్



కాసరబాధ గౌడ సంఘం అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని గౌడ సంఘం అధ్యక్షుడు రాచకొండ నాగరాజు, ఉపాధ్యక్షుడు బొమ్మ కంటి లింగయ్య అన్నారు. శనివారం సూర్యాపేట మండలం కాసర బాధ గ్రామంలో గౌడ సంఘం సభ్యత్వం కార్డులు గౌడ సంఘం సభ్యులకు అందజేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఎంతమంది అధ్యక్షులు ఉపాధ్యక్షులు మారిన మాకు ఇప్పటి వరకు సభ్యత్వం కార్డులు ఎవరు ఇప్పించలేదనీ ఈసారి తక్కువ సమయంలోనే కార్డులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని, గౌడ సంఘానికి ఏ సంక్షేమ పథకాలు వచ్చిన అందరికీ వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బంటు వెంకన్న, కోఆర్డినేట్ నెంబర్ కొల్లు బుచ్చయ్య ,కోల వెంకన్న, పోలగాని చిన్న గురవయ్య, తాటికంటి జానకి రాములు, పోలగాని వెంకయ్య ,మాచర్ల వెంకన్న, కొల్లు రాములు, దుండిగాల సైదులు చిత్తలూరి లింగయ్య. తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు మతిభ్రమించింది

- టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర

నవతెలంగాణ-రామన్నపేట



శాసనసభ బడ్జెట్ సమావేశలలో మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనకు మతిభ్రమించిందా అన్నట్లుగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర ఆరోపించారు.శనివారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రోడ్డు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేసీఆర్ కుటుంబం చేసిన పాపాలను గుర్తుచేసిన సందర్భంలో మీరు వారిని ఉద్దేశించి మాట్లాడడం అనేది మీ బుద్ధిలేనితనానికి నిదర్శనమన్నారు. మీ మామ కేసీఆర్ బడ్జెట్‌పై మాట్లాడుతూ చీల్చితం చెండాడుతం అన్నాడు కదా మరి ఎందుకు రాలేకపోయిండు, ఆ సోయి లేదా నీకు మీ మామాకు, 80 వేల పుస్తకాలు చదివిన మామ ఎక్కడికి పోయిండని విమర్శించారు. తెలంగాణ ప్రజలు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పంది కొక్కులాగా పడి రాష్టాన్ని దోచిందే కాక మామ, అల్లుడు, కూతురు, కొడుకు చేసిన పాపం పండి ఎక్కడ మీరు చేసిన పాపాల గురించి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎక్కడ బయట పెడతారో అనే భయం పట్టుకొని ఇష్టానుసారంగా కోమటిరెడ్డిని విమర్శించడం సరికాదన్నారు.కోమటిరెడ్డి వెంకట్‌ండ్డిపై చేసిన వ్యాఖ్యలను హరీష్ రావు వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

మహేష్ మృతికి సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

అస్సాం రాష్ట్రం ఆర్మీలో పనిచేస్తున్న జవాన్ ఈరటి మహేష్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణానికి సీపీఐ(ఎం) నల్గొండ జిల్లా కమిటీ సంతాపం తెలియజేస్తుందని జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. వీరి కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. మహేష్ మరణం వారి కుటుంబ సభ్యులతో పాటు దేశానికి కూడా తీరనిలోటని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టైప్ రైటింగ్ పరీక్షలు

నవతెలంగాణ-సూర్యాపేట



సాంకేతిక విద్యాశాఖ వారు జూలై మాసంలో నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు తెలంగాణ టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు కొండా శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి, ఆగస్టు నెలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత పొందుతారని తెలిపారు. ప్రైవేట్ రంగంలో కూడా టైప్ రైటింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు రెండు రోజులు కలిపి 300 మంది విద్యార్థులకు పైగా పరీక్ష రాశారని తెలిపారు. జనవరి లో నిర్వహించే పరీక్షలు రాయదల్చిన వారు వెంటనే టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి టైప్ నేర్చుకొని సులువుగా ఉద్యోగాలు పొందాలని కోరారు.

ఘనంగా బోనాల వేడుక

నవతెలంగాణ-కోదాడరూరల్



పట్టణంలోని ఎస్సార్ ప్రైమ్ స్కూల్‌లో డీజీఎం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో బోనాల వేడుకను ఘనంగా శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మెన్ సామినేని ప్రమీల విచ్చేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. ప్రమీల బోనం ఎత్తుకొని వచ్చిఅందరికీ అష్టైశ్వర్యాలు కలగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని మతాల ప్రాముఖ్యతను తెలియజేయడం ఎంతో అవసరం అన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని కోరుకున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులు శివసత్తుల, పోతురాజు వేషధారణలో అందర్ని ఆకట్టుకున్నారు. వివిధ సంస్కృతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, రఫీ, ఉపాధ్యాయునిఉపాధ్యాయులు,విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ పై బాలికలకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-నకిరేకల్



మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాలికలకు ర్యాగింగ్ పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని, ర్యాగింగ్ కు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కందాల పాపిరెడ్డి, బి. ప్రకాష్ రావు, కొండ యాదగిరి, వి. వెంకన్న, పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ మృతికి నివాళి

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు లింగాల వెంకన్న పెద్దమ్మ ఎల్లమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి చంద్రయ్య, వంటేపాక నరసింహ, సైదులు, చింతయ్య, శీను, విక్రం, వెంకన్న, లక్ష్మణ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మెన్‌గా అంజయ్య

నవతెలంగాణ-చిట్యాలటౌన్

నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ నల్గొండ జిల్లా చైర్మెన్‌గా చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన బొడిగె అంజయ్య గౌడ్ నియమితులయ్యారు. నియామక పత్రాన్ని నేషనల్ కన్స్యూమర్ నేషనల్ చైర్మెన్ ఎంవిఎల్ నాగేశ్వరరావు,తెలంగాణ రాష్ట్ర చైర్మన్ నల్లమాస శ్రీకాంత్ హైదరాబాదు లో శనివారం జరిగిన సమావేశంలో అందజేశారు.

నేర రహిత నల్లగొండగా తీర్చిదిద్దుదాం

డిఎస్పి శివరాం రెడ్డి

ప్రజా ప్రతినిధులు భాగస్వాములు అవ్వాలి

ఆగస్టు చివరి నాటికి సీసీ కెమెరాలు అన్ని పనిచేసేలా కృషి

సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాలతోపట్టణాన్ని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా కృషి చేస్తున్న పోలీసులతో ప్రజలు, ప్రజా ప్రతినిధులు కలిసి పని చేయాలని నల్లగొండ డి.ఎస్.పి శివరాం రెడ్డి కోరారు. నల్లగొండ పట్టణ వన్ టౌన్, టూ టౌన్, రూరల్ వివిధ కాలనీల ముఖ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లతో డి.ఎస్.పి కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడం కోసం పోలీసులు కృషి చేస్తున్నారని, ఇందులో ప్రజలు భాగస్వాములైనప్పుడే సులభంగా ఫలితాలు లభిస్తాయని చెప్పారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలో నేరాలు జరగకుండా నివారించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. అదే సమయంలో ఇప్పటికే పలు కాలనీలలో ఉన్న సీసీ కెమెరాలు అన్ని పనిచేసే విధంగా చూడాలన సూచించారు. గంజాయి విక్రయాలు, గంజాయి సేవిస్తున్న వారిని గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్న యువత గంజాయి బారినపడి తమ బంగారు భవిష్యత్తుకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు ప్రజలకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పిస్తూ వారు పెడదోవ పట్టకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ప్రజలు తమ ఇళ్లలో, కాలనీలలో, అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు వాటి సంబంధిత పోలీస్ స్టేషన్‌లతో అనుసంధానం చేయడం ద్వారా దొంగతనాలు, నేరాలు జరిగినప్పుడు వాటిని సులువుగా పరిష్కరించి అవకాశం కలుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇకనుండి పట్టణంలోని కాలనీలు, అపార్ట్‌మెంట్, రిలేటెడ్ కమ్యూనిటీ కాలనీల అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డులలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామని, దీనికి సంబంధిత వార్డుల కౌన్సిలర్లు తమకు సహకరించాలని ఆయన కోరారు. ఈ అవగాహన సదస్సులో పట్టణ వన్ టౌన్, టూ టౌన్ సి.ఐలు ఏమి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డానియల్ కుమార్, ట్రాఫిక్ సిఐ బిట్టు క్రాంతి కుమార్, ఏస్ ఐ లు సందీప్ రెడ్డి, మానస, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సమద్,బాబా, గడిగ శ్రీను, నవీన్ గౌడ్ అభిమన్యు శ్రీనివాస్, ఇంతియాజ్, యూత్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు పదేండ్లు జైలు, జరిమానా

నవతెలంగాణ-చింతపల్లి

హత్యాయత్నం కేసులో నిందితులకు పదేండ్లు జైలు, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఎస్సీ ,ఎస్టీ స్పెషల్ సెషన్స్ జడ్జి రోజా రమణి గ తీర్పు వెల్లడించినట్టు చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 23.08.2014 నాడు చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిసినగండ్ల యాదయ్య, సిరిసినగండ్ల జగన్, ఎరుకల రాజేష్ అదే గ్రామానికి చెందిన కాటేపాక చంద్రయ్య అను వ్యక్తి పై దాడి చేసి కర్రలు, రాళ్లతో అతనిపై హత్యాయత్నం చేశారు. కాటేపాక ఇంద్ర కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అప్పటి చింతపల్లి ఎస్ఐ కే. ధనుంజయ ఎస్ఐఆర్ నమోదు చేయశారు. అప్పటి దేవరకొండ డీఎస్పీ కే.మనోహర్ , జి చంద్రమోహన్ కేసు దర్యాప్తు చేసి సరైన ఆధారాలతో చార్జి షీట్ ఎస్సీ ,ఎస్టీ కోర్టులో దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించి జడ్జి శిక్ష ఖరారు వారికి శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్: శ్రీవాణి దామోదరం, ప్రాసిక్యూషన్ తరపున వాదించగా, ఈ కేసులో సాక్షులను ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా ప్రస్తుత దేవరకొండ డిఎస్పీ జి. గిరిబాబు, నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయినా ఏ నవీన్ కుమార్, చింతపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి యాదయ్య, కోర్టు డ్యూటీ ఆఫీసర్ అయిన ఎన్. వెంకటకృష్ణ హెడ్ కానిస్టేబుల్ , లైసెన్ ఆఫీసర్లను ఎస్పీ అభినందించారు.

చేనేత కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

నవతెలంగాణ-తిరుమలగిరి



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వార్షిక బడ్జెట్లో చేనేత రంగాన్ని,చేనేత కార్మికుల ప్రయో జనాలను ఏ మాత్రం పట్టించుకోలేదని చేనేత సంఘం జిల్లా నాయకులు, బీసీసంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం అన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. చేనేత నేతలను కనీస గుర్తింపు కాదు కదా వారి ఉనికినే ప్రశ్నార్థకం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం ఎంతో బాధాకరమన్నారు. ప్రజా ప్రభుత్వంలో చేనేతకు గతం కంటే మంచి ప్రాధాన్యత దక్కుతుతుందని ఆశించాం కానీ పెనం మీద నుండి పొయ్యిలోకి చేనేత రంగాన్ని, ,నేత కార్మికుల ను తోస్తుంది అనుకోలేదన్నారు. ప్రభుత్వం నేతన్నల బాధలు వారు పడుతున్నా కష్టాలను చూసి ఉపాధి కల్పనే కాకుండా నూలు సబ్సిడీ పథకం,నేతన్నకు చేయూత త్రీఫ్ట్ పథకం,చేనేత భీమా పథకం, మగ్గాల ఆధునీకరణ పథకాల అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. లేనిపక్షంలో ఆగస్టు 7 దాకా చూసి రాష్ట్రం లో ఉన్న నేత కార్మికులందరం వివిధ సంఘాలు,సామాజిక సంఘాలు ,కలిసొచ్చే అందరి తో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశం లో సంఘ నాయకులు వంగరీ సోమ కృష్ణ,మద్దూరి ఉమేష్,రాపోలు కొండయ్య,అక్కల ఉప్పలయ, వంగరీ రమేష్, కోక్కుల సోమనర్సయ్య,మద్దూరి శేఖర్, చిలుకమారి జయరాములు, వంగరీ కోటయ్య,కోట రాములు, వెంగలి పాండయ్య, మంచే అంబాదాస్,కోట సిద్ది రాములు, వెంగలి మధు, వంగరీ శ్రీను,కోమటి శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కేతపల్లి



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని 65వ జాతీయ రహదారి పై శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని కొత్తపేట గ్రామానికి చెందిన చింత నరసింహ, కందికంటి వెంకన్న లు టీవీఎస్ మోటార్ సైకిల్ పై కేతపల్లి మండల కేంద్రంలోని డిపో స్కూల్ వద్ద 65 నెంబర్ జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాదు నుండి విజయవాడ వైపు వెళుతున్న బొలెరో వాహనం అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి టీవీఎస్ మోటార్ సైకిల్ పై వెళుతున్న కందికంటి వెంకన్నను, చింత నరసింహు లను ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకన్న 55 అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం వెంకన్న మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతపల్లి ఎస్సై శివతేజ అన్నారు.